



జగన్ పార్టీ ఆల్ అవుట్



చింతలపూడి రా కదలిరా సభలో టీడీపీ అధినేత చంద్రబాబుకు మద్దతుగా జేజేలు పలుకుతున్న నేతలు

ఉప్పొంగిన ఉత్సాహం

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

చింతలపూడిలో సోమవారం జరిగిన 'రా..కదలిరా' తెలుగుదేశం బహిరంగ సభలో పార్టీ అధినేత చంద్రబాబు ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. జగన్ పాలనపై విరుచుకుపడినప్పుడల్లా సభకు హాజరైన జనంలో ఉత్సాహం ఉరికింది. ప్రసంగం సాగిన దాదాపు గంట సేపు సభాస్థలి హర్షధ్వానాలతో మిన్నంటింది. ఏలూరు జిల్లా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సభకు భారీగా జనం హాజరయ్యారు. రాబోయే ఎన్నికల్లో గెలుపు మనదే.. అని చంద్రబాబు నినదించినప్పుడు సభకు హాజరైన జనమంతా తమ హర్షామోదాలు తెలిపారు. మనకీ మంచి రోజులు వస్తాయి. కొద్ది కాలంలో మన పాలన రాబోతోందంటూ ప్రజలను, పార్టీ కార్య కర్తలను ఉత్సాహపరిచారు. 2014 ఫలి తాలు రిపీట్ కావాలి.. అన్ని స్థానాల్లో నూ మనమే గెలవాలి.. ఆ శక్తి మీలో వుంది.. అన్నప్పుడు హర్షధ్వానాలు మిన్నంటాయి. కరెంట్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్ ధరలు ఒకప్పుడు ఎలా వున్నాయో జగన్ వచ్చాక ఎలా ఉన్నాయో వివరిస్తుననప్పుడు జనం స్పందించారు. సాధారణంగా చంద్రబాబు తన ప్రసంగ శైలికి భిన్నంగా మాట్లాడి సభలో ఉత్సాహం రేకెత్తించారు. సభా ప్రాంగణం ముందు భాగంలో కూర్చున్న మహిళలైతే చంద్రబాబు ప్రసంగం సాగుతున్నంత సేపూ విజిల్స్ వేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. జగన్ పాలన తీరును ఎండగడుతూ నిజమా.. కాదా అంటూ ప్రజల నుంచి సమాధానాలు రాబట్టారు. ఒకప్పుడు లేని కరెంట్ బిల్లులు ఇప్పుడు రెండింతలయ్యాయి. రూ.65 వేల కోట్లు జనం నుంచి పిండేశారంటూ గణాంకాలతో సహా వివరిస్తున్నప్పుడు ఇదంతా జగన్ దోపిడీ కాదా అని ప్రశ్నించినప్పుడు.. అవును.. అవునంటూ సభికులు స్పందించారు. ఎన్నికల సభల్లో సీఎం జగన్ తనను తాను అర్జునుడిగా పోల్చుకోవడాన్ని చంద్రబాబు తప్పుబట్టారు. నువు అర్జునుడివి కాదు.. అక్రమార్జునుడివి.. అంటూ విరుచుకుపడ్డారు. ఇక నిన్ను భరించే పరిస్థితిలో జనం లేరు.. ఉన్నారా.. లేదా.. అంటూ ప్రశ్నించగా లేదు.. లేదు అంటూ తిరుగు సమాధానం వచ్చింది. ఈ సర్కారును ఉతికి ఉతికి ఆరేసే రోజులొచ్చాయి. మహిళలనుద్దేశించి మీరేమంటారనగా.. భరించలేమంటూ మహిళలు గొంతెత్తారు. పోలవరం, చింతలపూడి ఎత్తిపోతల పథకాలు తానొస్తేనే పూర్తవుతాయని చెప్పినప్పుడు రైతులు చప్పట్లు చరిచి ఆనందం వ్యక్తం చేశారు. నిండు అసెంబ్లీలో ఉద్దేశ పూర్వకంగా తన సతీమణిని అవమానించి నప్పుడు తానెంతో బాధపడ్డానని, ఇప్పుడు జగన్ తన చెల్లిపై, తల్లిపై, ఆడపడుచులందరిపై నిందలు వేస్తుంటే మౌనం ఎందుకంటూ ప్రశ్నించి వారిని ఆలోచింపజేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన విజయం రాష్ట్రానికి ఎంత అవసరమో వివరించారు.









గెలుపు మనదే

చింతలపూడి 'రా.. కదలి రా' సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

అధికార పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేల అరాచకాలపై ఫైర్

ఏలూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'ఈ జన సందోహాన్ని, మీలో ఉత్సాహాన్ని చూస్తుంటే గెలుపు ఖాయమనే నమ్మకం మరింత పెరిగింది. ఈ ప్రభంజనం ముందు జగన్ అండ్ పార్టీ ఆల్ ఔట్ అయిపోవాల్సిందే. మీ ఉత్సాహం, ఉరుకులు చూస్తుంటే జగన్‌కి కాలం చెల్లినట్టే. కానీ, అప్పుడే ఎవరూ రిలాక్స్ అవ్వద్దు. గెలిచేస్తున్నాం అని ఇంట్లో కూర్చుంటే ఇబ్బందులు తప్పవ'ని పార్టీ శ్రేణులను ఉద్దేశించి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం చింతలపూడిలో జరిగిన రా కదలిరా బహిరంగ సభలో మాట్లాడారు. 'ఓటమిని ముందుగానే పసిగట్టి అధికార పార్టీకి చెందిన ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ తప్పించుకున్నారు. పారిపోయిన ఎంపీ స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లాలోని ఎర్రిపప్ప మంత్రి కొడుకు ఇక్కడకు వస్తున్నారు' అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. 'చింతలపూడి ఎమ్మెల్యే వైసీపీలో సామాజిక న్యాయం లేదంటూ చేసిన వ్యాఖ్యలు నిజమే. గోదావరి జిల్లాలపై పెద్దిరెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి పెత్తనం ద్వారానే జగన్ సామాజిక న్యాయం ఏంటో అర్థమవుతుంది. ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు అవినీతి రాజాగా మారి పోలవరం కుడి కాల్వ గట్లు దోచేశారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అక్రమార్కులకే అక్రమార్కుడు. నియోజకవర్గాన్ని దోచేశారు. డబ్బు పిచ్చితో అక్రమ మైనింగ్ చేస్తూ అడ్డుపడ్డ చింతమనేనిపై పెట్టని కేసు లేదు. ఈ ఎన్నికల్లో జనం ఇచ్చే షాక్‌తో అబ్బయ్య తిరిగి లండన్ పారిపోవాల్సిందే.



చంద్రబాబు హెలీప్యాడ్ వద్ద బాంబు స్క్వాడ్ తనిఖీలు జరుపుతుండగా మెటల్ డిటెక్టర్ నుంచి అలెర్ట్ సైరన్ వచ్చింది. అప్రమత్తమైన అధికారులు స్నిఫ్ఫర్ డాగ్‌తో తనిఖీలు చేయగా కాంక్రీట్ కింద ఒక మేకు ఉన్నట్టు గుర్తించారు. ఏమీ లేదని తెలిసి అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈలోగా పుకార్లు షికారు చేశాయి.

పోలవరంలో తెల్లం బాలరాజు చేసే అక్రమాలకు హద్దు అదుపు లేదు. ఇసుక అక్రమాలతో రెచ్చిపోతూ, అడ్డొచ్చిన వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేస్తున్నారు. ఆ వేధింపులు తాళలేక పలువురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు కొడుకు నియోజకవర్గాన్ని నున్నగా గుండు కొట్టారు. భూభాగోతాల్లో అక్రమాలకు పాల్పడ్డారు. కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరావు కొడుకు చేతికి నియోజకవర్గ రాజకీయాన్ని అప్పగిస్తే ఐదేళ్లలో రూ.300 కోట్ల అక్రమార్జనతో, చెరువులు దోచుకు తిన్నారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని పని అయిపోయిందంటూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల అవినీతిని ఎండగట్టారు. చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో ఫాతిమాపురం సెంటర్ నుంచి పెట్రోలు బంకు వరకు ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, కార్యకర్తలు వాహనాల్లోనే ఉండిపోయి సభా వేదిక వద్దకు రాలేకపోయారు. మాజీ మంత్రి పీతల సుజాత కిలోమీటరున్నర నడిచి వేదిక వద్దకు చేరుకున్నారు. చింతలపూడి, రాఘవాపురం, ఎండపల్లి, ప్రగడవరం, యర్రంపల్లి, లింగపాలెం, దర్భాజీగూడెం, సీతానగరం, టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం, చాట్రాయి, పోలవరం, పలు గ్రామాల నుంచి మోటారు సైకిళ్ల ర్యాలీతో తరలివచ్చారు. టీడీపీ, జనసేన నేతలు చింతమనేని ప్రభాకర్, కేఎస్ జవహర్, పత్తిపాటి పుల్లారావు, మాగంటి బాబు, కొల్లు రవీంద్ర, అంగర రామ్మోహన్, మండవ లక్ష్మణరావు, దాసరి చంద్రశేషు తదితరులు పాల్గొన్నారు. పలువురు నేతలు మాట్లాడారు.

జగన్‌కు మళ్లీ ఓటు వేసి మోసపోవద్దు



- నాదీ చింతలపూడి ప్రాంతమే. ఇక్కడే చదువుకున్నా. ఒకసారి మాయలో పడి వైసీపీకి ఓటు వేశారు. రెండోసారి మోసపోవద్దు. టీడీపీ-జనసేనను గెలిపించి మన భవిష్యత్‌ను కాపాడుకుందాం.
  - గోరుముచ్చు గోపాల్‌యాదవ్



- దళితులను, యువకులను జగన్ మోసం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను రాజధాని లేని రాష్ట్రంగా చేశారు. మెట్టలో ఎత్తిపోతల పథకాన్ని పట్టించుకోలేదు. అమరావతి రాజధాని టీడీపీ-జనసేన ప్రభుత్వ ఏర్పాటుతోనే సాధ్యం.
  - బొమ్మాజీ అనిల్



- పరిపాలన చేతకాని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి.. పనికిమాలిన సభ పెట్టి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. ఈసారి ఎన్నికల్లో ఆయన్ను సాగనంపాలి.
  - గన్ని వీరాంజనేయులు





- ఐదున్నర కోట్ల మంది ప్రజల జీవితాలను జగన్ చీకటి పాలు చేశారు. బటన్ రెడ్డిని పంపడానికి ప్రజలు బటన్ నొక్కడానికి సిద్ధంగా ఉండాలి. లేకపోతే రాష్ట్ర భవిష్యత్ మరింత అంధకారంలోకి వెళ్లిపోతుంది.
  - కె.గోవిందరావు, రెడ్డి అప్పలనాయుడు



- జగన్ దళితులకు ఏ న్యాయం చేయలేదు. ఏదైనా జరిగితే అది చంద్రబాబు పాలనలోనే జరిగింది. జగన్‌ను గద్దె దించడానికి దళితులంతా ఏకం కావాలి.
  - రోషన్‌కుమార్



- ఐదేళ్లలో చింతలపూడి ఎత్తిపోతల పనులు చేపట్టలేదు. నాబార్డు రుణం రూ.1900 కోట్లు మళ్లించారు. అటవీ భూములు ఆక్రమించారు. పంటలు నష్టపోతే బీమా ఇవ్వలేదని విమర్శించారు.
  - ఘంటా మురళి



- టీడీపీ-జనసేన పొత్తుతో వైసీపీ చిత్తు అవ్వడం ఖాయం. అప్పుడే రాష్ట్రం అభివృద్ధి పథంలో గాడిన పడుతుంది. జగన్‌ను తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.
  - పీతల సుజాత





- జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని నాశనం చేశారు. గంజాయి ఆంధ్రాగా మార్చారు. ఇలాంటి నరరూప రాక్షసుడిని గద్దె దింపాలి. పోలవరం పూర్తి చేయని అసమర్థుడు జగన్.
  - బడేటి రాధాకృష్ణ, బొరగం శ్రీనివాస్



- దళితులను దగా చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి. ఆయనను ఇంటికి పంపడమే మన లక్ష్యం. కావాలి. ఆ దిశగా ప్రతి ఒక్కరూ కార్యరంగంలోకి దిగాలి.
  - ఆకుమర్తి రామారావు



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గోరుముచ్చు గోపాల్‌యాదవ్



జంగారెడ్డిగూడెం నుంచి 50 బస్సులు, వంద కార్లతో బయలుదేరిన బొమ్మాజీ అనిల్



పాదయాత్రగా సాగా రోషన్‌కుమార్, ఘంటా మురళి, ఆకుమర్తి రామారావు



చంద్రబాబు ప్రసంగానికి కేరింతలు కొడుతున్న తమ్ముళ్లు



దగ్గులూరులో పూడిక చేయని స్థలం

పునాదులు దాటని వైద్య విద్య..!



ఏలూరులో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ భవనం

రాష్ట్ర వైద్య విద్యలో నవశకం అంటూ.. వేల కోట్లతో పెద్ద ఎత్తున మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నామంటూ వైసీపీ ఊదరగొడు తోంది. కొత్త కళాశాలల ప్రారంభం, తరగతుల నిర్వహణ, నూతన భవనాల నిర్మాణంపై వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. ఏలూరు మెడికల్ కాలేజీ ప్రారంభమైనా కనీస వసతులు లేకుండానే తరగతులు నిర్వహిస్తున్నారు. పాలకొల్లు కాలేజీ భవన నిర్మాణానికి అసలు పునాదులే పడకపోవడం ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెలుగు చూశాయి.

- దగ్గులూరు మెడికల్ కళాశాల శంకుస్థాపనకు మూడేళ్లు.. నిర్మాణ పనులు ప్రారంభించి 14 నెలలు..
- ఏలూరులో తాత్కాలిక వైద్య కళాశాలతో విద్యార్థుల పాట్లు.. పేరుకే ల్యాబ్‌లు.. రసాయనాలు, అవసరమైన స్లైడ్స్ లేవు
- నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ, హాస్టళ్లు.. భర్తీకాని పోస్టులు.. నాణ్యతలేని విద్యాబోధన.. అయోమయంలో విద్యార్థులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి/పాలకొల్లు రూరల్/ఏలూరు క్రైం)

రాష్ట్రంలో పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంది. కాని ఆచరణలో ఉదాశీనంగా వ్యవహరించింది. పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాలను తొలుత తాడేపల్లిగూడెం విమానాశ్రయ భూములలో ఏర్పాటు చేయాలని భావించారు. కాని, తర్వాత దానిని నరసాపురంలో పేదల ఇళ్ల కోసం సేకరించిన 54 ఎకరాల్లో నిర్మించాలని నిర్ణయించారు. ఈ స్థలం భవన నిర్మాణాలకు అనుకూలంగా లేదని తేల్చడంతో పాలకొల్లు రూరల్ మండలం దగ్గులూరులో 63 ఎకరాలు సేకరించారు. మూడేళ్ల క్రితమే ఈ భూమిని వైద్య విధాన పరిషత్‌కు అప్పగించారు. వాస్తవానికి భవన నిర్మాణానికి అంచనాలు రూపొందించి, పరిపాలనా అనుమతులు తీసుకుని, ఆపై టెండర్లు ఖారారు చేసి, ఏజన్సీతో ఒప్పందం చేసుకున్న తర్వాత పనులకు శంకుస్థాపన చేయాలి. కాని సర్కార్ టెండర్లు ఖరారు కాకుండానే 2021లో వర్చువల్ విధానంలో సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. నిర్మాణానికి రూ.475 కోట్లు కేటాయించారు. అప్పటికీ పూర్తిస్థాయిలో భూసేకరణ ప్రక్రియ పూర్తికాలేదు. రైతులకు సొమ్ములు చెల్లించలేదు. శంకుస్థాపన జరిగి ఏడాది పూర్తయిన తర్వాత రైతులకు సొమ్ములు చెల్లించి ఏజన్సీని ఖరారు చేశారు. సీఎం నరసాపురం పర్యటన 2022 నవంబరులో ఖరారైంది. దీనికి వారం ముందు నుంచి వైద్య కళాశాల పనులు ప్రారంభమయ్యాయి. నిర్మాణ ఏజన్సీ కార్యాలయం కోసం అవసరమైన స్థలంలో మట్టి పూడ్చారు. ఇప్పటికీ కార్యాలయం పనులు పూర్తి కాలేదు. ఒకటి, రెండు భవన



దగ్గులూరులో కళాశాల కోసం వేసిన పిల్లర్లు

నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. వైద్య కళాశాల కోసం సేకరించిన 63 ఎకరాలను పూర్తిస్థాయిలో ఇంకా పూడిక చేయలేదు. కళాశాల మంజూరుచేసి మూడేళ్లయ్యింది. పనులు ప్రారంభించి 14 నెలలు కావస్తోంది. స్థలమే పూడిక చేయకపోవడంతో కళాశాల ఎప్పటికీ అందుబాటులోకి వస్తుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వద్ద సొమ్ములు లేకపోవడం వల్లే నిర్మాణాల్లో జాప్యం జరుగుతోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వైద్య విద్య ఇలాగేనా ?

ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైన ఏలూరు ప్రభుత్వ మెడికల్‌లో అరకొర సౌకర్యాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 150 సీట్లతో పాత బస్టాండ్ సమీపంలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయ తాత్కాలిక భవనంలో తరగతులు ప్రారంభమయ్యాయి. అక్కడే ల్యాబ్‌లు ఉన్నట్లు, మరికొన్ని ల్యాబ్‌లు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఉన్నట్లు చూపించారు. బాలికలు, బాలురకు హాస్టల్స్‌ను వేరే అపార్టుమెంట్లు చూపించి చివరకు ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఎంసీహెచ్ (తల్లీబిడ్డల విభాగం) భవనం పైఅంతస్తులో తాత్కాలికంగా హాస్టల్స్‌ను వేర్వేరుగా ఏర్పాటు చేశారు. ప్రభుత్వాసుపత్రి ఆవరణలో మెడికల్ కాలేజీ భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. పనులు కొనసాగుతున్నాయి. గత ఏడాది సెప్టెంబరు 1న మెడికల్ కాలేజీ తరగతులు ప్రారంభమయ్యాయి. ఫస్టియర్‌లో అనాటమి 210 తరగతులు, ఫిజియాలజీ 130 తరగతులు, బయాలజీ 78 తరగతులతోపాటు పెద్ద సంఖ్యలో సెల్ఫ్ గ్రూప్ లెర్నింగ్ తరగతులు నిర్వహించాల్సి వుంది. కాలేజీలో పేరుకు ల్యాబ్‌లున్నా అవసరమైన రసాయనాలు, హిస్టాలజీ స్లైడ్స్ లేవు. ల్యాబ్‌లో ప్రాక్టికల్స్ చేయాల్సి వున్నా డిజిటల్ తరగతు ల్లోనే చూపిస్తున్నారు. బయాలజీ, ఫిజియోలజీ ల్యాబ్‌లు ఇదేవిధంగా ఉన్నాయి. ఇంత వరకూ అవసరమైన పరికరాలు లేవు. ఇదేమి మెడికల్ కాలేజీ అంటూ విద్యార్థులు తలలు పట్టుకుంటున్నారు. తరగతులు ప్రారంభమై ఐదు నెలలు పూర్తయినా ఇంత వరకూ ల్యాబ్‌లో ప్రాక్టికల్స్ తూతూ మంత్రంగానే సాగుతున్నాయి. అవసరమైన వైద్య యంత్ర సామగ్రి లేవు. వీటి ఏర్పాటులో ప్రభుత్వం విఫలమైంది. తాత్కాలిక భవనాల్లో తరగతి గదులు నిర్వహిస్తుండగా అక్కడ వైద్య తరగతులు తాత్కాలికమే అన్నట్లు కనిపిస్తోంది. పూర్తిస్థాయిలో ఫ్యాకల్టీ పోస్టులను మిగిలిన టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో నేటికీ తూతూమంత్రంగానే మెడికల్ కళాశాలను నిర్వహిస్తున్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. భవనాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావాలంటే మరో మూడేళ్లు పడుతుంది.

ఏపీ నిట్‌లో పనులు వేగవంతం



కలెక్టర్ ప్రశాంతి

భీమవరం, ఫిబ్రవరి 5:తాడేపల్లిగూడెం నిట్‌లో మౌలిక సదుపాయాల పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం వెలగపూడి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్ రెడ్డి రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం- 2014లోని షెడ్యూల్- 13 కింద ఏర్పాటు చేసిన విద్యాసంస్థలు, మౌలిక సదుపాయాలు, ప్రాజెక్టులపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం నిట్ పనులపై జవహర్‌రెడ్డి ఆరా తీశారు. కలెక్టర్ వమాట్లాడుతూ నిట్ కళాశాల సంబంధించి అప్రోచ్ రహదారులు, టెక్నికల్ సమస్యలు పూర్తిచేసుకుని టెండర్లు దశలో ఉన్నాయని నెలాఖరు లోపు పనులు ప్రారంభానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.మేజర్ డ్రైయిన్‌కు సంబంధించి రూ.3.85 కోట్లతో అంచనాలను రూపొందించగా 2.50 కోట్లు రూపాయలు మున్సిపాలిటీ జనరల్ ఫండ్స్ నుంచి కేటాయించారని, మిగిలిన 1.35 కోట్లు ఎన్‌ఐటీ ఖర్చు చేస్తుందని, త్వరలోనే టెండర్లు పిలవనున్నామని తెలిపారు. వాటర్ ప్లాంట్ పనులు జరుగుతున్నాయని ఏప్రిల్ 30న ప్రారంభోత్సవానికి సిద్ధం చేసేలా సంబంధిత అధికారుల ఆదేశించినట్లు ప్రధాన కార్యదర్శికి వివరించారు. సమావేశంలో తాడేపల్లిగూడెం ఆర్డీవో కె.చెన్నయ్య, మున్సిపల్ కమిషనర్ ఏ.శామ్యూల్ పాల్గొన్నారు.

చలో అసెంబ్లీకి అనుమతులు లేవు : ఎస్పీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 5 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి ఎటువంటి అనుమతులు లేవని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తేదీన రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం తమ సమస్యల పరిష్కారానికి చలో అసెంబ్లీ అనే కార్యక్రమాన్ని తలపెట్టిందని దీన్ని ఆసరా చేసుకుని కొన్ని అసాంఘిక శక్తులు శాంతి భద్రతలకు భంగం కల్గించే అవకాశం ఉన్నందున పోలీసు అనుమతులు లేవన్నారు. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ 30 అమలులో ఉన్న కారణంగా సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతులు లేవన్నారు.ఎవరైనా ఆదేశాలు దిక్కరించి ఈ కార్యక్రమంలో పాల్గొంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

13న జడ్పీ సర్వసభ్య సమావేశం

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 5: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 13 వతేదీన ఉదయం 10.30 గంటలకు నిర్వహించ నున్నట్టు జడ్పీ సీఈవో సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి జిల్లా పరిషత్ బడ్జెట్ సవరణ అంచనాలపై చర్చ, వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష ఉంటుందని తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షకు 140 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5 : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 12 సెంటర్లలో ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో జరిగిన ఒకేషనల్ విభాగం ప్రాక్టికల్స్‌కు మొత్తం 1577 మంది దరఖాస్తు చేసుకోగా 1438 మంది హాజరయ్యారని డీవీఈవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు నమోదు కాలేదన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు 9 వరకు గడువు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5 : గతేడాది ఫిబ్రవరిలో జరిగిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు నేషనల్ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసేందుకు తుది గడువును ఈనెల 9వరకు పొడిగించినట్టు డీఈవో పి.శ్యాం సుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. గడువు తేదీలోగా వివరాలను నమోదు చేసిన వారికే స్కాలర్‌షిప్‌ను కేంద్రం మంజూరు చేస్తుందని, ఆ తర్వాత ఎటువంటి కోర్టు వ్యాజ్యాలకు తావులేదని స్పష్టం చేశారు.

డీఎల్‌ఎడ్ సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5 : డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ ఎడ్) మొదటి సెమిస్టర్ (2022-24 బ్యాచ్), 2021-23 బ్యాచ్ ఫెయిల్డ్ అభ్యర్థులకు నిర్వహించనున్న పరీక్షలకు ఫీజును సంబంధిత కళాశాలల ప్రిన్సి పాల్స్‌కు పెనాల్టీ లేకుండా ఈ నెల 11లోగా, రూ.50 పెనాల్టీతో ఈ నెల 15లోగా చెల్లించాలని డీఈవో శ్యాంసుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆన్ లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి bse.ap.gov.in వెబ్‌సైట్ అందుబాటులో ఉందన్నారు.

2,500 క్యూసెక్కుల నీరు విడుదల

భీమవరం ఫిబ్రవరి 5 : గోదావరి పశ్చిమ డెల్టా ఆయకట్టులోని జిల్లాకు చెందిన రబీ పంట కాలానికి కాలువలకు సోమవారం నుంచి వంతుల వారీగా నీటి విడుదల ప్రారంభించారు. రోజుకు 2500 క్యూసెక్కుల వరకు తాగునీటిని విడుదల చేస్తున్నారు. శెట్టిపేట నుంచి తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, ఉండి సబ్ డివిజన్లో వారీగా కాలువలను విభజించి వారం రోజుల పాటు నీరు అందే విధంగా ఏర్పాటు చేశారు. ఏప్రిల్ నెల వరకు సాగుతుందని అధికారులు తెలిపారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 5: ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే దుకాణ దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వారి లైసెన్స్‌లను రద్దు చేస్తామని వ్యవసాయ శాఖ ఏడీ సుబ్బారావు హెచ్చరించారు. మండలంలోని తిమ్మాపురం, దొరసాని పాడులోని ఎరువుల దుకాణాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

దుకాణంలోని రిజిస్టర్లను పరిశీ లించారు. రైతులు కొన్న ఎరువులకు సక్రమంగా బిల్లులు ఇవ్వాలని, తూకంలో వ్యత్యాసం లేకుండా విక్రయించాలని సూచించారు. తూకంలో తేడాలుంటే మండల వ్యవసాయాధికారి దృష్టికి తీసుకెళ్లాలని రైతులను కోరారు. ఏవో దుర్గారమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించిన వాడికోసం మౌన దీక్ష

పెద్దల మధ్యవర్తిత్వంతో కథ సుఖాంతం



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 5: మూడు రోజులుగా మౌన దీక్షచేసి దూరమైన ప్రేమికుడిని పెళ్ళికి ఒప్పించిందా యువతి. విజయవాడలోని ఒక ప్రైవేటు బ్యాంకులో పని చేస్తున్న ఆగిరి పల్లి మండలం నూగొండ పల్లి గ్రామానికి చెందిన మౌనికకు నున్నలో రాడ్ బెండింగ్ పనులు చేసే వెలటూరు గ్రామానికి చెందిన సువర్ణ రాజుతో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. వివాహానికి ఇరుపక్షాల బంధువులు ఒప్పుకున్నారు. అయితే ఆ రెండు కుటుంబాల మధ్య మనస్పర్థల కారణంతో వివాహం ఎప్పుడు జరిపించేదీ తేలక పోవడంతో యువతి ఆత్మహత్య చేసుకుందామని నూగొండ పల్లి శివారులో ఉన్న పోతవరప్పాడు గ్రామానికి వచ్చి అక్కడ రక్షణ ఆశ్రయం వద్ద మౌన దీక్షకు కూర్చుంది. ఇది గమనించిన ఆశ్రయం వ్యవస్థాపకుడు గురివిందపల్లి చిట్టిబాబు గ్రామపెద్దలను పిలిపించారు. వారు 100కి కాల్ చేయగా, దిశ టీమ్ వచ్చి వివరాలు కనుక్కుని వెలటూరు గ్రామంలోని యువకుడు సువర్ణరాజును, సంబంధీకులను పోత వరప్పాడు రప్పించారు. ఇక్కడ పెద్దల సమక్షంలో ఇరుపక్షాలకు రాజీ కుదర్చగా ఈ నెల 12న వివాహం జరుపుతామని మాటి చ్చారు. మధ్య వర్తులుగా ఎమ్మార్పీఎస్ నాయకులు గురువిందపల్లి చిట్టిబాబు, మంగలపూడి నాగేశ్వర రావు వ్యవహ రించారు. దండలు మార్పించి నిశ్చితార్థం జరిపించారు.

సర్వర్ డౌన్

నిలిచిపోయిన రిజిస్ట్రేషన్‌లు

రోజంతా పనిచేయని సర్వర్..కక్షిదారుల పాట్లు



ఆచంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వేచి ఉన్న కక్షిదారులు

ఆచంట, ఫిబ్రవరి 5: రిజిస్ట్రేషన్ శాఖలో తరచూ తీసుకువస్తున్న కొత్త మార్పులతో రిజిస్ట్రేషన్ కోసం వస్తున్న కక్షిదారులకు అవస్థలు తప్పడం లేదు. ఇటీవలే రిజిస్ట్రేషన్ శాఖ 2.0 విధానాన్ని తీసుకువచ్చింది. ఆ విధానం ద్వారానే రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశాలు జారీ కావడంతో అప్పటి నుంచి డాక్యుమెంటుకు సంబంధించి ఎవరి డేటా వారే చేసుకుని కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునే పరిస్థితి ఇప్పటికే ఏర్పడింది. అయితే తరచూ సర్వర్ సమస్య తలెత్తడంతో రిజిస్ట్రేషన్‌లు సజావుగా జరగడం లేదు. సోమవారం రోజంతా సర్వర్ సమస్య తలెత్తడంతో ఉదయం 10 గంటల వరకు వచ్చిన కక్షిదారులు సాయంత్రం 5 గంటల వరకు వేచి చూసి చివరకు తమ ఇళ్లకు వెళ్లిపోయారు. ప్రతీ రోజూ రిజిస్ట్రేషన్‌ల ద్వారా ప్రభుత్వానికి స్టాంపు డ్యూటీ రూపంలో కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. అయితే ప్రభుత్వం సంబంధిత శాఖపై దృష్టి సరిగ్గా పెట్టకపోవడంతో తరచూ సర్వర్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం ఇటీవల పలు గ్రామాల్లో ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో ఆ పట్టాలకు సంబంధించి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు ఉచితంగా చేసి ఇవ్వడానికి ఆదేశాలు జారీచేసింది. కొన్ని రోజులుగా జిల్లాలో ఈ రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి. దీని కారణంగానే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సర్వర్ సమస్య తలెత్తుతోందని అంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు దృష్టి పెట్టి రిజిస్ట్రేషన్‌లు సజావుగా అయ్యేలా చూడాలని కక్షిదారులు కోరుతున్నారు.

ఆకివీడు : సర్వర్ల సమస్యలతో రిజిస్ట్రేషన్లకు అంతరాయం ఏర్పడింది. భూములపై పెంచిన మార్కెట్ రేట్లను ప్రభుత్వం జూన్ నెల నుంచి అమలు చేయనున్నదని రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవాలనే ఆలోచనతో జనం కార్యాలయాలకు వస్తున్నారు. పనులు మానుకొని కార్యాలయాలకు వస్తే ఇక్కడకు వచ్చిన తరువాత సర్వర్లు పనిచేయడం లేదని అధికారులు చెప్పుతుండడంతో నిరీక్షించి నిరాశతో వెనుతిరుగుతున్నారు. ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. సోమవారం సర్వర్ సమస్య రావడంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన కక్షిదారులు నిరాశతో వెనుతిరిగారు.

ఈపోస్ మొరాయింపు..నిలిచిన సరుకుల పంపిణీ



ఉండి: ఈపోస్ సర్వర్ మొరాయించడంతో రేషన్ సరుకుల పంపిణీకి ఆటంకం ఏర్పడింది. సోమవారం ఉదయం ఈపోస్ బాగానే పని చేసింది. 11 గంటల నుంచి 4 గంటల వరకు సర్వర్ సమస్య తలెత్తడంతో పనిచేయలేదు. దాంతో సరుకులు పంపిణీ నిలిచిపోయింది. పంపిణీ చేసే వ్యాన్ వద్ద కార్డు దారులు క్యూకట్టారు. నాలుగు గంటల తరువాత ఈపోస్ పని చేయడంతో సరుకులు పంపిణీ చేశారు. బియ్యం ఉచితంగా, పంచదార, కందిపప్పు నగదుకు అందించారు.

ఇక్కడ ఎలా ఉండాలి ?

జనావాసాల మధ్య డంపింగ్‌యార్డు..

రోగాల పాలవుతున్నాం

కలెక్టరేట్ వద్ద పాలమూరు వాసుల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు

భీమవరం, ఫిబ్రవరి 5 : తమ గ్రామంలో రహదారిని అనుకుని జనావాసాల మధ్య పెట్టిన డంపింగ్ యార్డును తొలగించాలని కోరుతూ పెనుమంత్ర మండలం పొలమూరు గ్రామ పంచాయతీకి చెందిన గ్రామస్థులు సోమవారం భీమవరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. గ్రామానికి చెందిన వారు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో పోలీసులు వారిని మెయిన్ రోడ్‌లోనే అడ్డుకున్నారు. వినతిపత్రం ఇవ్వడానికే వచ్చామని చెప్పడంతో కలెక్టరేట్ వరకు అనుమతించారు.దీంతో వారంతా కలెక్టరేట్ కార్యాలయం వద్ద బైఠాయించారు.. తమ గ్రామం నుంచి మాముడూరు గ్రామం వెళ్ళే రోడ్డు వెంబడి పదిహేను వందలమందికి పైగా జనాభా కలిగి వున్న సుమారు 350 కుటుంబాలు నివసిస్తున్నారని అన్నారు. నివాసాలను ఆనుకుని దగ్గరగా ఉన్న కొద్ది స్థలంలో పొలమూరు గ్రామ పంచాయితీకి చెందిన మొత్తం చెత్తను తీసుకొచ్చి



పేరుకుపోయిన చెత్త

అక్కడ పడేస్తున్నారని తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆరేళ్లుగా పంచాయతీ వారు ఇక్కడే చెత్త వేస్తున్నారని గతంలో ఇక్కడ చెత్త వుండేది కాదని వినతి పత్రంలో పేర్కొన్నారు. తరచూ చెత్తను అంటిం చడం వల్ల దాని పొగ కారణంగా అనారోగ్యం పాలవు తున్నామన్నారు. దోమలు, ఈగలు, దుర్వాసనతో ఇబ్బం దులు పడుతున్నామని అన్నారు. గతంలో పంచాయతీకి వెళ్లి విజ్ఞాపన చేసిన స్పందించలేదని ఆరోపించారు. కలెక్టర్ జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కొంతసేపు నినాదాలు చేసి ధర్నా చేశారు. కలెక్టరుకు స్పందనలో నివేదిక సమర్పించారు.



మావుళ్ళమ్మకు సారె అందిస్తున్న దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తలు

మావుళ్ళమ్మకు విజయవాడ దుర్గమ్మ సారె

భీమవరం టౌన్, ఫిబ్రవరి 5 :మావుళ్ళమ్మ అమ్మవారికి విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన తరుపున సోమవారం సారె అందించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు చెన్నా జనార్ధనరావు, కె.వెంకటరాజు ఆలయ సిబ్బంది, అర్చకులు సారె తీసుకువచ్చారు. ధర్మ ప్రచార పరిషత్ కార్యక్రమంలో ఆలయానికి చేరుకున్న వారికి ఈవో యర్రంశెట్టి భద్రాజీ ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం చైర్మన్ మానేపల్లి నాగన్నబాబు,పాలకవర్గ సభ్యులు రామాయణం సత్యనారాయణ, ముత్యాల రామారావు, భాగ్యలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పాపికొండల అభయారణ్యం ప్రాంతాల్లోకి పులి

పోలవరం, ఫిబ్రవరి 5 : కొన్ని రోజులుగా ఏలూరు జిల్లాలో ద్వారకా తిరుమల, బుట్టాయిగూడెం, పోలవరం మండలాల్లో సంచరిస్తూ పాడి పశువులపై దాడులకు పాల్పడుతూ అటు ప్రజానీకానికి అటవీశాఖ అధికారులకు కంటి మీద కునుకు లేకుండా భయభ్రాంతులకు గురిచేసిన పులి పాపికొండల అభయారణ్యం సరిహద్దుల్లోకి తిరిగి వెళ్ళినట్లు సోమవారం అటవీక్షేత్రాధికారి దావీదు రాజు తెలిపారు. విజయనగరం నుంచి రప్పించిన బోన్లు, ట్రాప్ కెమెరాలు కొవ్వాడలో ఏర్పాటు చేశామని పులి పాపికొండల అభయారణ్యం వైపు వెళ్ళినట్లు మాత్రమే కెమెరాల్లో రికార్డయ్యిందని, తిరిగి వచ్చిన దాఖలాలు లేవని ధ్రువీకరించారు. పులి పూర్తిగా అభయారణ్యంలోకి ప్రవేశించే వరకూ సమీప ఏజన్సీ ప్రాంతాల ప్రజలు అడవుల్లోకి పశువులను మేపడానికి వెళ్లరాదని, రాత్రిపూట బయట సంచరించరాదని హెచ్చరించారు.

తాడేపల్లిగూడెంలో చూసి రాతలు



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 5: తాడేపల్లిగూడెంలో బోర్డ్ ఆఫ్ ఇంటర్‌మీడియట్ నిర్వహణలో ఒక జూనియర్ కళాశాలలో సోమవారం మొదలైన పరీక్షల్లో చూసి రాతలు వెలుగు చూశాయి. రెండు బ్యాచ్‌లుగా నిర్వహిస్తున్న డైరీ, సీఈసీ, ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యు పరీక్షలు కళాశాల నిర్వాహకులకు కాసులు కురిపి స్తున్నాయి. ఈ పరీక్షల్లో నిబంధనలకు నీళ్ల వదిలి విద్యార్థులకు సెల్‌ఫోన్‌లు, పుస్తకాలు, స్లిప్పులతో నిర్వహిస్తున్నారు. ఉదయం పూట నిర్వహించిన పరీక్ష పేపర్‌లను సాయంత్రం 4 గంటల వరకూ సీల్ వేయకుండా విద్యార్థులకు ఇచ్చి ఆఫీస్ రూంలో పరీక్షలు రాయిస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ఆ ఆరోపణలకు తగ్గట్టే ఆఫీస్ రూంలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయకపోవడం ఈ వాదనలకు బలం చేకూరుస్తున్నాయి. ఇక్కడ వేసిన ఇన్విజిలేటర్ల నుంచి పరిశీలకుల వరకూ అందరికీ ముడుపులు అందుతున్నాయని స్థానికులే బాహాటంగా చెబుతుండటం కొసమెరుపు.

15వ తేదీ వరకే ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు : జేసీ

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 5 : జిల్లాలో ఖరీఫ్ పంటకాలం 2023-24 నకు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈనెల 15వ తేదీన నిలిపివేయనున్నట్టు జేసీ లావణ్యవేణి తెలిపారు. ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియలో భాగంగా 261 రైతు భరోసా కేంద్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా గుర్తించి 133 సహాయక కేంద్రాల ద్వారా 3,36,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని లక్ష్యంగా నిర్ణయించారన్నారు. ఇప్పటివరకు 3,25,043 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని (97 శాతం) కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసినట్టు తెలిపారు. జిల్లాలో ఇంతవరకు 254 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 41,422 మంది రైతుల నుంచి రూ.710.05 కోట్లు విలువైన 3,25,043 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు సేకరించినట్టు తెలిపారు. ప్రస్తుతం రూ.657.85 కోట్లు రైతుల వ్యక్తిగత ఖాతాలకు జమ చేశారని, మరో రూ.52.20 కోట్లు బ్యాంక్ వద్ద జమ చేసే ప్రక్రియలో ఉన్నాయన్నారు.

క్రైం కార్నర్

గోదావరిలో యువకుడి మృతదేహం లభ్యం

యలమంచిలి, ఫిబ్రవరి 5: రెండురోజులుగా కనిపించకుండా పోయిన మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన తమ్ము అశ్వినికుమార్ (26) మృతదేహం సోమవారం చించినాడ వద్ద గోదావరిలో లభ్యమైనట్టు ఎస్ఐ శివన్నారాయణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. చేపలవేట చేస్తూ జీవనం సాగించే అశ్వినికుమార్ శనివారం వేకువజామున వేటకు వెళ్లి ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు అతని కోసం గాలించగా అతని బైక్ చించినాడ బ్రిడ్జిపై ఉండటంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉప్పుటేరులో దూకి యువకుడి ఆత్మహత్య



కైకలూరు, ఫిబ్రవరి 5: యువకుడు ఉప్పుటేరులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కైకలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు గ్రామానికి చెందిన మడిచర్ల సోమశేఖర్ (23) ఆదివారం రాత్రి కైకలూరు మండలం ఆలపాడు శివారులో ఉన్న ఉప్పుటేరు వంతెనపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ సమయంలో అతని స్నేహితులతో కలసి ఆ ప్రాంతానికి వచ్చాడు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంటానని పరిగెత్తుకుంటూ ఉప్పుటేరులో దూకేశాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై రామకృష్ణ గజ ఈతగాళ్ళతో ఉప్పుటేరులో గాలించి సోమవారం మృతదేహాన్ని వెలికితీశారు. కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్ప గించారు.

గోస్తనీ కాల్వలో వృద్ధురాలి మృతదేహం



తణుకు, ఫిబ్రవరి 5 : వెంకట్రాయపురం ఆంధ్రా సుగర్స్ ఎదురుగా ఉన్న గోస్తనీ కాలువలో వృద్ధురాలి మృత దేహం లభ్యమైనట్టు పోలీసులు తెలిపారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన పైడిముక్కల గంగాదేవి (75) గతనెల 18న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె కుమారుడు వీర వెంకట సత్యనారాయణమూర్తి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. సోమవారం గోస్తని కాలువలో మహిళ మృతదేహం లభ్యమైనట్టు వచ్చిన సమాచారంతో రూరల్ పోలీసులు పరిశీలించగా గంగాదేవి మృతదేహంగా నిర్ధారించారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై అత్యాచారయత్నం

పెదవేగి, ఫిబ్రవరి 5 :ఓ కామాంధుడు చిన్నారి జీవితాన్ని చిదిమేయడానికి ప్రయత్నించగా కొంతమంది యువకులు గమనించడంతో పరారయ్యాడు. పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాసకుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఎల్‌కేజీ చదువుతున్న ఐదేళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువకుడు ఆదివారం సాయంత్రం చీకటి పడుతున్న సమయంలో గ్రామ సచివాలయ సమీపంలో చెరువు దగ్గరకు తీసుకెళ్లి అత్యాచారం చేసేందుకు ప్రయత్నించగా సమీపంలో వాలీబాల్ ఆడి ఆటుగా వస్తున్న యువకులు అతని చేష్టలు గమనించి కేకలు వేయడంతో పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రులు పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఫోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి గ్రామంలో సోమవారంపెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ విచారణ చేశారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ..ముగ్గురికి గాయాలు



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 5: తాడేపల్లిగూడెం ఎస్వీఆర్ సర్కిల్‌లో ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయా లయ్యాయి క్షతగాత్రులను 108 వాహ నంలో ఏరియా ఆసుపత్రికి తరలించారు. జంగా రెడ్డిగూడెం నుంచి తాడేపల్లిగూడెం వెళ్తున్న బస్సును రెండో ఫ్లైవోవర్ నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో బస్సు అద్దాలు పగిలి ప్రయా ణికులకు గుచ్చుకున్నాయి. బస్సులో పెద్దగా ప్రయాణికులు లేక పోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుధాకరరెడ్డి వివరించారు.

కట్నం వేధింపుల కేసులో భర్తకు మూడేళ్లు జైలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 5 : కట్నం చాలలేదని భార్యను వేధించిన భర్త పై నేరం రుజువు కావడంతో మూడేళ్ళు జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ ఏలూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాసుదేవ్ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఏలూరుకు చెందిన లావూరి ప్రమీల తాడేపల్లిగూడెం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆమెకు తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెంకు చెందిన కేతావత్ కిషన్ నాయక్‌తో వివాహం అయింది. కట్నం కోసం వేధిస్తున్నాడంటూ బాధితురాలు 2020 సంవత్సరంలో ఏలూరు దిశ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి అతనిని అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో మూడు సంవత్సరాల జైలు శిక్ష, పది వేల రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి వాసుదేవ్ సోమవారం తీర్పు చెప్పారు.

సీడీపీవో లైంగిక వేధింపులపై ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 5: సీడీపీవో తనను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని అంగన్‌వాడీ టీచర్ పోలీసులను ఆశ్రయించిన ఉదంత మిది. ముదినేపల్లి పోలీసుల వివరాల ప్రకారం ముదినేపల్లి మండలం వి.రావిగుంటకు చెందిన అంగన్‌వాడీ కేంద్రం టీచర్ చిన్నం నిరోషా తాను సక్రమంగా విధులు నిర్వహిస్తున్నా కైకలూరు సీడీపీవో ఆనంద్‌కుమార్ తాను సక్రమంగా విధులు నిర్వహించటం లేదని, రికార్డులు పొందుపరచటంలో అలసత్వం వహిస్తున్నానని వేధిస్తున్నాడని, తన పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట కుమార్ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 5 : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక మహిళను ఏలూరు త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు సత్రంపాడుకు చెందిన మరీదు సముద్రవేణి అక్రమంగా మద్యం విక్రయిస్తుందని సమాచారం అందడంతో నెహ్రూ కాలనీ వద్ద తనిఖీలు చేపట్టారు. సముద్రవేణి అక్కడ మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నారు. ఆమె నుంచి నాలుగు మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు.

ఐదు మద్యం బాటిళ్లు స్వాధీనం

పాలకోడేరు, ఫిబ్రవరి 5 : మోగల్లులో అంగర ధనలక్ష్మీ మద్యం అమ్ముతున్న సమాచారం మేరకు దాడి చేసి ఐదు మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

మహిళపై దాడి..ముగ్గురిపై కేసు నమోదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 5 : తమ ఇంట్లోకి మురుగునీరు వస్తోందని ప్రశ్నించిన ఒక మహిళపై ఆ కుటుంబ సభ్యులు దాడి చేయడంతో వారిపై కేసు నమోదైంది. ఏలూరు ఎస్‌ఆర్‌పేటలో నివాసం ఉంటున్న బంకూరి శశికళ ఇంటిపక్కన ఖాళీ స్థలంపై కోర్టు స్టే ఉంది. అయినప్పటికీ బత్తుల వీర వెంటక సత్యనారాయణ ఇల్లు నిర్మించారు. ఆ ఇంట్లో వాడిన మురుగునీరు శశికళ ఇంటి ఆవరణలోకి వస్తున్నాయని ఈనెల 1వ తేదీ రాత్రి ప్రశ్నించింది. దీంతో సత్యనారాయణ, భార్య రుద్రవేణి, కుమార్తె సంధ్య దాడి చేశారు. గాయపడిన ఆమె ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరింది. త్రిటౌన్ పోలీసులు సోమవారం ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నరసాపురంలో మిషన్ హైస్కూల్ రోడ్

సార్ వచ్చారని తొలగించారు..

కానీ వేయడం మరిచారు

సీఎం పర్యటనలో స్పీడ్ బ్రేకర్లు తొలగింపు

14 నెలలు గడిచినా నోచుకోని పనులు

ఆ ప్రదేశంలో తరుచూ ప్రమాదాలు

నరసాపురం, ఫిబ్రవరి 5:మూడు నెలల క్రితం నరసాపురం పట్టణంలోని మిషన్ హైస్కూల్ రోడ్‌లో వేగంగా వెళుతున్న రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరూ చనిపోగా మరో ప్రభుత్వ ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన వైద్యం అందుకుని ఆ ఉద్యోగి కోలుకున్నారు. ఇలాంటి సంఘటనలే గడిచిన ఏడాది కాలంలో అనేకం జరిగాయి. పట్టణంలో ఎంతో ప్రధానమైన రహదారి కావడంతో ఎప్పుడూ ట్రాఫిక్ రద్దీగా కనిపిస్తుంది. పంజా సెంటర్ నుంచి జగన్నాధస్వామి గుడి వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర ఉన్న ఈ డబల్ రోడ్డులో గతంలో స్పీడ్‌బ్రేకర్లు ఉండేవి. ఇవి వాహనాల స్పీడ్‌ను కంట్రోల్ చేసేవి. అయితే ఏడాదిన్నర క్రితం ముఖ్యమంత్రి నరసాపురం పర్యటనకు విచ్చేసినప్పుడు బహిరంగ సభను వీవర్స్ కాలనీలో ఏర్పాటు చేశారు. సరిపల్లిలో హెలికాప్టర్ దిగిన సీఎం ఈ రహదారి నుంచే సభా వేదిక వద్దకు వెళ్లారు. భద్రతా కారణాల దృష్ట్యా అప్పట్లో పట్టణంలోని స్పీడ్ బ్రేకర్లను తొలగించారు. 14 నెలలు గడిచినా వీటిని పునర్ నిర్మించలేదు. ఈ రోడ్‌లో మిషన్ హైస్కూల్‌తో పాటు మరో కార్పొరేట్ స్కూల్ కూడా ఉంది. ఈ స్కూల్ వెనుక మరో విద్యా సంస్థ కూడా ఉంది. నిత్యం వందలాది మంది విద్యార్థులు ఈ మార్గం గుండా వెళ్లుతుంటారు. తరుచూ ప్రమాదాలు జరుగు తుండటంతో చాలామంది తల్లితండ్రులు పిల్లల్ని స్వయంగా తీసుకొచ్చి స్కూళ్ళ వద్ద విడిచిపెడుతున్నారు. ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు వేయాలని అనేక సార్లు కమిషనర్‌కు విన్నవించారు. స్పందనలో అనేక సార్లు ఫిర్యాదులు చేశారు.అయినా స్పందన లేదు. దీనిపై కమిషనర్ వెంకటేశ్వరావు వివరణ ఇస్తూ గతంలో ఉన్న స్పీడ్ బ్రేకర్ల స్థానంలోనే పునర్ నిర్మించేందుకు టెండర్లు పిలిచాం. త్వరలో పనులు చేపడతాం, వీటితో పాటు మిగిలిన చోట్ల కూడా స్పీడ్ బ్రేకర్లు వేస్తున్నట్లు చెప్పారు.

జనసేన, టీడీపీ సీట్ల సర్దుబాటు సంతృప్తికరంగా ఉండాలి : జోగయ్య

పాలకొల్లు, ఫిబ్రవరి, 5 : జనసేన, టీడీపీ మధ్య సీట్ల సర్దుబాటు జన సైనికులు సంతృప్తి చెందేలా ఉండాలని రాష్ట్ర కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి హరి రామజోగయ్య అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 175 సీట్లు ఉన్న రాష్ట్రంలో కనీసం 50 సీట్లయినా జనసేన దక్కించుకోగల్గితేనే రాజ్యాధికారం పూర్తిగా కాకపోయినా పాక్షికంగానైనా దక్కే అవకాశం ఉంటుందన్నారు. పదవులు ముఖ్యం కాదు రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం అని పవన్ కల్యాణ్ అంటుంటారని, అయితే అధికారం అంతా చంద్రబాబుకు ధారపోస్తే రాష్ట్ర ప్రయోజనాలు ఎలా దక్కించుకుంటారనే ప్రశ్న జనసైనికుల్లో ఉందన్నారు. జనసేనకు 40 నుంచి 50 సీట్లు తక్కువ కాకుండా ఇవ్వకపోయినా, కాపు సామాజిక వర్గానికి జనాభా ప్రాతిపదికన సీట్ల పంపకం జరక్కపోయినా ఓట్ల ట్రాన్స్‌ఫర్ సవ్యంగా జరగక అనుకున్నది సాధించలేని ప్రమాదం ఉందని జోగయ్య ప్రకటనలో పేర్కొన్నారు.

10న రాష్ట్ర స్థాయి ఓపెన్ చదరంగం పోటీలు

భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5 : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10 న భీమవరం జీవీఆర్ కల్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి ఓపెన్ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సోమవారం గ్రంధి రవితేజ పోస్టర్లు ఆవిష్కరించారు. ప్రజా నాయకుడు, కళా, క్రీడా రంగాలకు చెందిన ఎంతోమందికి ప్రోత్సాహం అందించిన గ్రంధి వెంకటేశ్వరరావు స్మారకంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని కార్యదర్శి తోట భోగయ్య చెప్పారు.



న్యాయవాదుల వంటావార్పు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 5 : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం నూజివీడు కోర్టు హాలు వద్ద వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించలేని ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2022ను తక్షణం రద్దు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నూజివీడు బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

స్పందన అర్జీలను పరిష్కరించండి : కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 5: జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలను అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల వినతులను కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, జేసీ బి.లావణ్యవేణి, డీఆర్వో డి.పుష్పమణి, జడ్పీ సీఈవో సుబ్బారావు, ఆర్డీవో ఖాజావలీ, డీఆర్‌డీఏ పీడీ విజయ్ రాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ వినతులు స్వీకరించారు.

వివిధ సమస్యలపై 223 అర్జీలు అందాయి. ద్వారకాతిరుమల దేవస్థానం సిబ్బంది తమ భూమిలో గట్లు, చెట్లు రాళ్లు తీసేసి సరిహద్దుల్లో జెండాలు పాతారని, న్యాయం చేయాలని ద్వారకా తిరుమలకు చెందిన రాజగోపాలరావు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. తమ భూమిమీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవేరోడ్డు వెళ్లిందని, తగిన నష్ట పరిహారం ఇవ్వాలని పేరంపేట గ్రామానికి చెందిన లక్ష్మి విజ్ఞప్తి చేశారు. తమ భూమికి పట్టాదార్ పాస్‌పుస్తకం ఇవ్వాలని నిడమర్రుకు చెందిన సుమిత్ర కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. ఉంగుటూరు మండలం కొక్కిరమూడి గ్రామానికి చెందిన దివ్యాంగుడు యడవల్లి ఏడుకొండలు కలెక్టర్ వెంకటేశ్‌ను కలిసి తనకు ట్రైసైకిల్‌లేక ఇబ్బందులు పడుతున్నానని అర్జీ ఇచ్చాడు. తక్షణం స్పందించిన కలెక్టర్ దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారి పి.రాకాడమణికి చెప్పి తక్షణం ట్రైసైకిల్‌ను అందించారు.

9న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

ఆల్‌బెండాజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం నివారించవచ్చని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అన్నారు. ఈనెల 9న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీకి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో దీనికి సంబంధించి పోస్టర్‌ను జేసీ లావణ్యవేణితో కలసి ఆవిష్కరించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ శర్మిష్ట, డీఆర్వో పుష్పమణి, జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు, డీఈవో శ్యామ్‌సుందర్, ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండండి : ఏఎస్పీ


ఫిర్యాదును పరిశీలిస్తున్న ఏఎస్పీ స్వరూపరాణి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 5: సైబర్ నేరగాళ్లు ఓటరు నమోదు కార్యక్రమాలని చెప్పి బయోమెట్రిక్ మిషన్ ద్వారా వేలిముద్రలను సేకరిస్తూ మోసం చేసే ప్రమాదాలున్నాయని ఏఎస్పీ స్వరూపరాణి హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని ఏఎస్పీ జి.స్వరూపరాణి సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 50 ఫిర్యాదులను స్వీకరించారు. వాటి సత్వర పరిష్కారం కోసం సంబంధిత ప్రాంత పోలీసు అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫోన్‌చేసి ఓటీపీ అడిగితే చెప్పకూడదని ఆమె సూచించారు. సైబర్ నేరగాళ్లు విలువైన సమాచారం, బ్యాంక్ ఖాతాలో సొమ్ము తస్కరిస్తారన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఎంవీఐ ప్రసాద్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 5 : వాహనం నడిపేటప్పుడు రోడ్ల సైన్లు, ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను అనుసరించడంతో పాటు ఒకే లైన్ అనుసరించాలని ఎంవీఐ టీవీఎస్.ప్రసాద్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అవసరమైనప్పుడు వాహన ఇండికేటర్లను ఉపయోగించాలని, ఎల్ అనే బోర్డు ఉన్న, బేబీ ఆన్ బోర్డు వంటి సైన్లు వలన మరింత జాగ్రత్తగా డ్రైవింగ్ చేయడానికి దోహదపడతాయన్నారు. జీబ్రాక్రాసింగ్ వద్దనే రోడ్లు దాటాలన్నారు. హెల్మెట్, సీటు బెల్టు ఉపయోగించడం మేలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపవద్దని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపల్ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నిస్వార్థ సేవాపరులు తపనా చౌదరి


బీజేపీ ప్రచార సభలో కళాకారులు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 5 : తపన ఫౌండేషన్ ద్వారా 16 ఏళ్ల నుంచి సేవా కార్యక్రమాలు చేపడుతున్న గారపాటి తపనా చౌదరిని ఎంపీగా ఎన్నుకుంటే మరింత అభివృద్ధి చేస్తారని జబర్దస్త్ కళాకారుడు అదిరే అభి అన్నారు. జీలుగుమిల్లి రైస్‌మిల్ వద్ద జబర్దస్త్ కళాకారులు, సినీ గాయకులు బీజేపీ తరుపున ప్రచారం చేశారు. కుట్టు శిక్షణ కేంద్రాలు, తాగునీటి వసతులు, పేద విద్యార్థుల చదువుకు చేయూత వంటి సేవా కార్యక్రమాల్ని జబర్దస్త్ టీం ప్రజలకు గుర్తు చేశారు. దర్భగూడెం, ములగలంపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమ్ కిషోర్, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొడియం శ్రీనివాసరావు, పోలవరం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వంకా కాంచనమాల, కొండపల్లి ప్రసాద్ ఉన్నారు.

హేమ సుందర్‌కు సకల కళాభూషణ్ అవార్డు


అవార్డు అందుకుంటున్న హేమసుందర్

ఏలూరు కల్చరల్, ఫిబ్రవరి 5: నగరానికి చెందిన అభినయ నృత్య భారతి వ్యవస్థాపకుడు నాట్యాచార్య దువ్వి హేమ సుందర్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు లభించింది. పాలకొల్లులో క్షత్రియ సంక్షేమ పరిషత్, గౌరీశంకర్, సంగీత నృత్య కళా అకాడమి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సకల కళాభూషణ్ అవార్డు అందజేశారు. నర్తకుడిగా నాట్యాచార్యుడిగా, గాయకుడిగా ప్రదర్శనలతో పాటు జాతీయ, రాష్ట్ర, యూనివర్సిటీ స్థాయి పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించి విశేష కృషిచేస్తున్నారు. ఆయనకు అవార్డు రావడంపై పలువురు నాట్యాచార్యులు, నాట్య కళాకారులు అభినందించారు.

ఆటపాటలతో విద్యార్థులకు ఆరోగ్యం

పెదవేగి, ఫిబ్రవరి 5: ఆటపాటలు విద్యార్థులకు ఆరోగ్యాన్నిస్తాయని అమ్మపాలెం పాఠశాల హెచ్‌ఎం టి.సుజాత అన్నారు. చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు సోమవారం ఆటలపోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. హెచ్‌ఎం సుజాత మాట్లాడుతూ ఆటపాటలు విద్యార్థుల జీవితాల్లో ఒక భాగం కావాలన్నారు. అప్పుడే ఆ విద్యార్థి జీవితం ఉన్నతంగా మారుతుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో చైల్డ్‌రైట్స్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రవిబాబు, గ్రామ కార్యదర్శి పి.విజయరాజేష్, ఎస్.రాహీ సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల నీళ్ల ట్యాంక్‌లో జంతు కళేబరం..!

పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల గగ్గోలు

పోలవరం, ఫిబ్రవరి 5: పాఠశాల విద్యార్థులు భోజన ప్లేట్లు, గ్లాసులు, చేతులు ముఖం కడుక్కునే నీళ్ల ట్యాంక్‌లో జంతు కళేబరం గుర్తించడంతో విద్యార్థులు గగ్గోలు పెట్టారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ప్లేట్లు, గ్లాసులు కడుక్కునే తరుణంలో నీరు వాసన రావడం గమనించి ఉపాధ్యాయులకు తెలిపారు. ఉపాధ్యాయులు పంచాయతీ కార్యదర్శికి శనివారం ఫిర్యాదు చేశారు. పంచాయతీ సిబ్బంది సోమవారం ట్యాంక్ శుభ్రంచేయడానికి వెళ్లారు. ట్యాంక్‌లో చూసిన కోతి, కుక్క అనే ఆనవాలు తెలియని కుళ్లిన కళేబరం కనిపించింది. నిత్యం 550 మంది విద్యార్థులు వాడుకునే నీటి ట్యాంకుపై మూత తీసిన సిబ్బంది మూతవేయకపోవడం వలన డాబాలపై నుండి వెళ్ళిన కోతి లేదా కుక్క అందులో పడి చనిపోయినట్లుగా భావిస్తున్నారు. ట్యాంక్ లోపల నాచు, రకరాకల వ్యర్థాలతో ఎప్పటి నుండో శుభ్రం చేయించని విషయం బయటపడింది. విద్యార్థులు వినియోగించే నీటి ట్యాంకులు శుభ్రం చేయించడంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ, సిబ్బంది నిర్లక్ష్యం వహించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల్లో శుభ్రత, ఆహార నాణ్యత విషయాల్లో నిర్లక్ష్యం వలన అనుకోని సంఘటలు జరిగినప్పుడే అధికారులు హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారని, నెల నెలా పాఠశాల, హాస్టళ్లలో శుభ్రత, ఆహార నాణ్యతలపై ఎలాంటి పర్యవేక్షణ ఉండడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.





కొయ్యలగూడెం, కామవరపుకోట, కుక్కునూరు, జీలుగుమిల్లి మండలాల నుంచి చింతలపూడి రా.. కదలిరా సభకు తరలివెళుతున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

ఉప్పొంగిన అభిమానం

రా.. కదలిరా సభకు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు


పెదవేగి నుంచి అభిమానులతో తరలివెళుతున్న చింతమనేని

ఉప్పొంగిన అభిమానం రహదారులను పసుపుమయం చేసింది. ఏ దారి చూసినా చింతలపూడి వైపే.. భారీ వాహన శ్రేణి.. భారీ జన సందోహం.. చింతలపూడిలో సోమవారం జరిగిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రా.. కదలిరా సభకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బైక్‌లు, కార్లపై అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. దెందులూరు నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఏలూరు నియోజకవర్గం నుంచి స్వచ్ఛందంగా వేలాది మంది కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారని నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడేటి చంటి తెలిపారు. పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ముఖ్యంగా మహిళలు బుట్టాయగూడెం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు మహిళలు తరలివెళ్లారు. యంత్రప్రగడ శ్రీనివాసరావు, మొగపర్తి సోంబాబు, గద్దె అబ్బులు, సున్నం నాగేశ్వరావు ఆలపాటి షణికిషోర్ తదితరులు పాల్గొన్నారు. దెందులూరు మండలం నుంచి మాగంటి నారాయణప్రసాద్, యలమర్తి హేమ శ్రీనివాస్, యిప్పిలి వెంకటేశ్వరావు, పెనుబోయిన మహేష్ యాదవ్, గారపాటి కొండయ్య చౌదరి, గాలాయగూడెంలో ఏనుగు రామకృష్ణ, పూజారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్లు, మోటార్‌సైకిల్‌లతో ర్యాలీగా వెళ్లారు. భీమడోలు భీమడోలు, పోలసానపల్లి, కురెళ్ళగూడెం, పూళ్ళ కొల్లేరు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు గుండుగొలను చేరుకుని అక్కడ నుంచి చింతలపూడికి తరలి వెళ్లారు. ఉంగుటూరు మండలంలో వివిధ గ్రామాల నుంచి, కాగుపాడులో కడియాల రవిశంకర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. పోలవరం మండలం నుంచి టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డు కృష్ణ ఆధ్వ ర్యంలో టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు వివిధ వాహనాల్లో చింతల పూడి తరలి వెళ్లారు. మంగిన కొండ, కుంచే దొరబాబు, పోతుల శ్రీను, నునకాని రాంబాబు, యడ్ల వినోద్, పిల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు, వ్యాన్లు, తదితర వాహనాలపై భారీ సంఖ్యలో తరలివెళ్ళారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, కిలారు సత్యనారాయణ, ఘంటా సుధీర్‌బాబు, పలవురు నాయకుల ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. లింగపాలెం మండలం నుంచి రా.. కదలిరా బహిరంగ సభకు బారీ సంఖ్యలో తెలుగు దేశం శ్రేణులు తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు గరిమళ్ళ చలపతి రావు ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు కార్లు, ఆటోలలో తరలివెళ్లారు. రంగాపురం సర్పంచ్ మునునూరి రాము ఆధ్వర్యంలో సుమారు 200 పైగా బైకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. మోరంపూడి మల్లికార్జున్‌రావు, గుత్తా సత్యసాయివరప్రసాద్, వందలాది మంది కార్యకర్తలు వెళ్లారు. కొయ్యలగూడెం మండలం నుంచి చంద్రబాబు బహిరంగ సభకు భారీగా జనం తరలివెళ్ళారు. ఈ ర్యాలీని పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. పారేపల్లి రామారావు, మండల టీడీపీ నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు. టీడీపీ జీలుగుమిల్లి మండల అధ్యక్షుడు సుంకవల్లి సాయికృష్ణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ములగలంపల్లి, రాచన్నగూడెం, దర్భగూడెం, కామయ్యపాలెం, స్వర్ణవారిగూడెం, గిరిజన గ్రామాల నుంచి ఆటోలు, బైక్‌లపై నాయకులు తరలి వెళ్లారు. ఉండవల్లి సోమ సుందరం, నాలి శ్రీను, బి.రాజబాబు,


ఏలూరు నుంచి వాహనాలకు జెండా ఊపి ప్రారంభిస్తున్న బడేటి చంటి

కొర్లపాటి సునీల్, బొలగాని అకిల్, గారపాటి శ్రీను, పి.శివాజీ, తోట బాలు పాల్గొన్నారు. కుక్కునూరు మండలం నుంచి తెలుగుదేశం, జనసేన సైనికులు భారీగా తరలివెళ్లారు. దాదాపు 2వేల మందికారులు, టాటా మ్యాజిక్, లారీలు, ద్విచక్రవాహనాలపై తరలివెళ్లారు. ములిశెట్టి నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, పిచుక రాజు, జనసేన నాయకులు యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. వేలేరుపాడు మండలం నుంచి సుమారు 50 వాహనాల్లో కార్యకర్తలు చింతలపూడికి వెళ్లారు. మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు కొమ్మన వెంకటేశ్వర్లు, కట్టం రాంబాబు, యాళ్ల శంకర్, రామచంద్రరాజు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. టి.నరసాపురం మండలం నలుమూలల నుంచి వివిధ వాహనాల్లో కార్యకర్తలు తరలి వెళ్లారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంక టేశ్వరరావు జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. తోట లక్ష్మీనారాయణ, ఆచంట సూర్యనారాయణ, వాసిరెడ్డి మోహన్‌రావు, జోనుబోయిన సోంబాబు, గండబోయిన శ్రీను, సందేపూడి సాయి, శిరిమళ్ళ గోపి, కొల్లి రమేష్, అద్దంకి జగ్గారావు, మోదుగు రామారావు, వేములయ్య తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం పట్టణం, మండలం నుంచి ప్రత్యేక బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలపై టీడీపీ కార్యకర్తలు, నాయకులతో పాటు జనసైనికులు భారీగా వెళ్లారు. టీడీపీ నాయకులు ఆకుమర్తి రామారావు, బొమ్మాజి అనిల్, సొంగా రోషన్‌కుమార్, టీడీపీ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు.

పెదవేగి, ఏలూరు టూటౌన్, బుట్టాయగూడెం, దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు, పోలవరం, కామవరపుకోట, లింగపాలెం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం





టి.నరసాపురం, భీమడోలు, లింగపాలెం, బుట్టాయగూడెం మండలాల నుంచి వాహనాలపై తరలివెళుతున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 5: ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు బదిలీపై జిల్లాకు వచ్చిన పలువురు తహసీల్దార్లకు మండలాలను కేటాయిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పలువురు తహసీల్దార్లు, ఎంపీడీవోలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు అర్బన్ తహసీల్దార్‌గా బీఎస్‌వీవీకే ముఖర్జీ బాధ్యతలు స్వీకరించారు. ముఖర్జీ కాకినాడ రూరల్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ బి.సోమశేఖర్ పదోన్నతి లభించింది.

- దెందులూరు: తహసీల్దార్‌గా వి.జితేంద్ర బాధ్యతలు తీసుకున్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్ వి నాంచారయ్య కృష్ణా జిల్లా కలెక్టరేట్ ఏవోగా బదిలీ అయ్యారు.
- ద్వారకాతిరుమల: తహసీల్దార్‌గా రవికాంత్ బాధ్యతలను చేపట్టారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్యాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు.
- భీమడోలు: తహసీల్దార్‌గా జి.వరహాలయ్య విధుల్లో చేరారు. కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో పనిచేసిన ఆయన భీమడోలు బదిలీ అయ్యారు. ఎంపీడీవోగా టి.స్వర్ణలత విధుల్లో చేరారు. కృష్ణాజిల్లా పామర్రు నుంచి ఆమె ఇక్కడికి బదిలీపై వచ్చారు.
- పోలవరం: తహసీల్దారుగా జీవీఆర్.ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాకినాడ నుంచి ఇక్కడికి బదిలీ కాగా ఇక్కడ పనిచేసిన బత్తుల సుమతి కృష్ణా జిల్లా బదిలీ అయ్యారు.
- కామవరపుకోట: ఎంపీడీవోగా జంగం స్వర్ణభారతి బాధ్యతలు స్వీకరించారు. కృష్ణాజిల్లా బంటుమిల్లి నుంచి ఆమె ఇక్కడికి బదిలీపై వచ్చారు.
- ఉంగుటూరు: ఎంపిడివోగా డీఎల్ఎస్.శర్మ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. తూర్పు గోదావరి జిల్లా గొల్లప్రోలు నుంచి బదిలీపై వచ్చారు. తహసీల్దార్‌గా కేఏ.వెంకట శివయ్య బాధ్యతలు స్వీకరించారు.
- కొయ్యలగూడెం: తహసీల్దార్‌గా రాజ్యలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కాకినాడ జిల్లా గోపవరం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.
- లింగపాలెం: తహసీల్దార్‌గా వి.ప్రసాద్ బదిలీపై వచ్చారు. ఆయన ఎన్టీఆర్ జిల్లా కంకిపాడు నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు.
- కుక్కునూరు తహసీల్దార్‌గా దాసరి అచ్యుత కుమారి బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన ప్రమద్వర కోనసీమ జిల్లా అయినవల్లి మండలానికి బదిలీపై వెళ్లారు.
- టి.నరసాపురం: తహసీల్దార్‌గా టి.సుభాష్ బాధ్యతలు చేపట్టారు. తూర్పు గోదావరి జిల్లా పెదపూడి మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన జెవి సుబ్బారావు కృష్ణా జిల్లా ఉంగుటూరు వెళ్లారు.
- చింతలపూడి: తహసీల్దార్‌గా పి.గోపాలకృష్ణ, నగర పంచాయతీ కమిషనర్‌గా డీజేఎస్.ప్రసాదరాజు, ఎంపీడీవోగా చినరత్నాలు, సీఐగా సుధాకర్, ఎస్ఐగా కుటుంబరావు బాధ్యతలు స్వీకరించారు.
- ఏలూరు క్రైం: త్రి టౌన్ ఎస్ఐగా ఫణీంద్ర బాధ్యతలు చేపట్టారు. ఆయన విజయవాడ గవర్నర్‌పేట ఎస్ఐగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. సీఐ వెంకటేశ్వరరావును కలసి పూలమొక్కను అందించారు.


మద్యం దుకాణం వద్ద ధర్నా చేస్తున్న మహిళ సమాఖ్య సభ్యులు

మద్యపాన నిషేధం అమలు చేయాలి

వేలేరుపాడు, ఫిబ్రవరి 5: ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్ మద్యపానం నిషేధిస్తామని హామీ ఇచ్చి మోసగించారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లను దండుకుని మద్యం ధరలు పెంచి దారుణంగా దోచుకుంటున్నారని ఏపీ మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో వేలేరుపాడు ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల మాట్లాడుతూ మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంతో ప్రభుత్వ ఖజానా నింపుకోవడానికి ప్రధాన వనరుగా చూస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం అమ్మిస్తున్న మద్యం కారణంగా చిన్న వయస్సులోనే మహిళలు భర్తలను కోల్పోతున్నారని, కుటుంబ పోషణకోసం ఆర్థిక భారాన్ని మోయవలసి వస్తోందన్నారు. మద్యం కారణంగా మహిళలపై దాడులు జరుగుతున్నాయని, అయినా ముఖ్యమంత్రి నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యపాన నిషేధం హామీని ఈ ఎన్నికల ముందు అయినా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళ నాయకురాలు సాయమ్మ, సునీత, విమల, జ్యోతి, గంగాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ భూములకు విద్యుత్ అక్రమ కనెక్షన్లు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 5 : ఎర్రకాలువ ప్రాజెక్టు ఇరిగేషన్ భూముల్లో విద్యుత్ అక్రమ కనెక్షన్‌లు అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం అన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆర్డీవో అధ్యక్షుకు వినతిపత్రం అందజేశారు. జీవరత్నం మాట్లాడుతూ తాడువాయి, చిన్నవారిగూడెం, ఎ.పోలవరం గ్రామాలలో విద్యుత్ అక్రమ కనెక్షన్ శాశ్వతంగా తొలగించాలన్నారు. అక్రమ సాగు దారులతో విద్యుత్ అధికారులు కుమ్మక్కు అయ్యారని ఆరోపించారు. పేద ప్రజలు సాగు కోసం కనెక్షన్‌లు అడిగితే కుదరదని చెప్పే అధికారులు భూస్వాముల తాయిలాలకు దాసోహం అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించకుంటే తామే ప్రత్యక్ష కార్యాచరణకు దిగి ఆ భూమిలో సాగు చేస్తామని, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని అధికారులను హెచ్చరించారు. మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్‌రావు, యాగంటి సీత, జి.సూర్య కిరణ్, నరసింహారావు,సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ఏఐటీయూసీ పోరాటం

టి.నరసాపురం, ఫిబ్రవరి 5: కార్మికుల సంక్షేమానికి ఏఐటీయూసీ అలుపెరగని పోరాటం చేస్తోందని చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షుడు టీవీఎస్ రాజు తెలిపారు. మక్కినవారిగూడెంలో ముఠా వర్కర్స్ యూనియన్ సమావేశం సోమవారం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలు అమలులో విఫలమయ్యాయన్నారు. మోదీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని విమర్శించారు. జగన్మోహనరెడ్డి కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని ప్రగల్భాలు పలికారన్నారు. ముఠా వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లెల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా బైగాని ఏకాంబరం, కార్యదర్శి కొప్పుల సతీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భోజన కార్మికులకు గౌరవ భృతి పెంచాలి


డీఈవో కార్యాలయంవద్ద నినాదాలు చేస్తున్న భోజన పథకం కార్మికులు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు గౌరవభృతిని పెంచాలని, మార్కెట్ ధరలకు అనుగుణంగా వంట చార్జీలను పెంచాలని డిమాండ్ చేస్తూ డీఈవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ.ప్రసాద్ మాట్లాడుతూ భోజన పథకం కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, బడ్జెట్ కేటాయింపులను పెంచాలని డిమాండ్ చేశారు. వంటగ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. వంట చేస్తున్న సందర్భంలో మహిళాకార్మికులు అగ్ని ప్రమాదాలకు గురవుతున్నా ఎటువంటి వైద్య సదుపాయాలు, బీమా సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీనెల 5వతేదీలోగా గౌరవభృతి, వంటచార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛంద సంస్థలను తొలగించి మహిళా కార్మికులతోనే పథకాన్ని కొనసాగించాలన్నారు. దీర్ఘకాలంగా పనిచేస్తున్న కార్మికులకు ఉపాధి భద్రత, గుర్తింపుకార్డులు, ఏడాదికి రెండు జతల యూనిఫాం, వంటపాత్రలు ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తం చేస్తామని హెచ్చరించారు. డీఈవో కార్యాలయ ఏడీ-1 అవధానికి వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు కొండలరావు, చంద్రకళ, లక్ష్మి, అశోక్, వెంకటలక్ష్మి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులను రెగ్యూలర్ చేయాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 5: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యూలర్ చేయాలని యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకుడు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం శ్రీనివాసరావు సీఐటీయూ నాయకులు డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు జగన్ పాదయాత్రలో ఇచ్చినట్లుగా కాంట్రాక్టు కార్మికులందర్ని రెగ్యులర్ చేయాలన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ సంస్థలో విలీనం చేయాలన్నారు. విధి నిర్వహనలో అనేక మంది ప్రాణాలు కోల్పోయేది విద్యుత్ సంస్థలోనే అన్నారు. ఇటువంటి కార్మికులను ముఖ్యమంత్రి పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, సత్తిబాబు, సాయిబాబు పాల్గొన్నారు.


మాగంటి బాబుతో కలసి కేక్ కట్ చేస్తున్న చంద్రబాబు

మాగంటి బాబుతో కేక్ కట్ చేయించిన చంద్రబాబు

చింతలపూడి: మాజీ ఎంపీ మాగంటి బాబు పుట్టినరోజు సందర్భంగా రా.. కదలిరా బహిరంగ సభ వేదికపైనే చంద్రబాబు నాయుడు సోమవారం కేక్ కట్ చేశారు. మాగంటి బాబుకు చంద్రబాబు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు మాగంటి బాబుకు అభినందనలు తెలిపారు. పలువురికి మాగంటి భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు.

ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 5: ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వాలు తోడ్పడాలని సర్పంచ్‌ల సంఘం నాయకులు మెండెం సంతోష్‌కుమార్ అన్నారు. ఎన్ఆర్.పేట ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం జరిగింది. దళిత ఆదివాసి మ్యానిఫెస్టో 2024 ఆవిష్కరించారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ దళితులు, ఆదివాసీల జీవన స్థితిగతులు ఆర్థికాభివృద్ధికి 10 ముఖ్యమైన అంశాలతో మేనిఫెస్టో రూపొందించామన్నారు. సింగవరపు జ్యోతి, ఝాన్సీరాణి, పీ.సురేష్, రోజ, తదితరులు పాల్గొన్నారు.

శివమండపంలో యాచకుడు మృతి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 5: శ్రీవారి క్షేత్ర శివమండపంలో యాచకుడు మృతిచెందాడు. గ్రామంలో సంచరిస్తూ భిక్షాటనతో జీవించేవాడు. సోమవారం ఉదయం అతడు శివమండపంలో అపస్మారక స్థితిలో ఉండడాన్ని గుర్తించి పంచాయితీకి తెలియపరిచారు. పంచాయతీ సిబ్బంది మృతదేహాన్ని ఖననం చేయించారు. అతని పూర్తి వివరాలు తెలియరాలేదు.

నేషనల్ స్కాలర్‌షిప్‌కు రంగాపురం విద్యార్థులు ఎంపిక

లింగపాలెం, ఫిబ్రవరి 5: రంగాపురం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం బి.వెంకటరత్నం తెలిపారు. దొండపాటి జయచంద్ర, కనిపెడ వంశిక స్కాలర్‌షిప్‌కు ఎంపిక అయ్యారు. ఇంటర్మీడియట్ పూర్తయ్యేవరకు ఏటా రూ.12వేలు కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు రైట్ మెయిన్ కెనాల్ యూనిట్ 2 ఏలూరు ల్యాండ్ ఎక్విజిషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మేరుగు ముక్కంటి కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌ను మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు.
- గుప్తా ఫౌండేషన్ ద్వారా ప్రజలకు అండగా నిలుస్తుండడం శుభ పరిణామమని స్నేహం అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు అంబికా రాజా అన్నారు. మోహన్‌గుప్తాను శాలువాకప్పి ఘనంగా సత్కరించారు.
- **ఏలూరు టూటౌన్ :** నగరంలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి కిషోర్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం స్పందనలో వినతిపత్రం సమర్పించారు.
- **కుక్కునూరు :** పాత రామాలయం ప్రాంగణంలో మంగళవారం శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించనున్నారు.
- **టి.నరసాపురం :** వల్లంపట్ల పంచాయతీ సాయంపాలెం గ్రామానికి చెందిన ఆడమిల్లి రవి గత నెల 29న ఏలూరు ఆసుపత్రికి మందులు కోసం వెళ్లి తిరిగి రాలేదు. భార్య సరస్వతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ విజయకుమార్ తెలిపారు.
- **దెందులూరు :** దోసపాడు, పోతునూరులో ఆరోగ్యమాత ఉత్సవాలు వైభవంగా కనుల పండుగగా జరుగుతున్నాయి. దోసపాడు చర్చి విచారణ గురువు పరిశే డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో పరిశుద్ధ ఆరోగ్యమాతకు దివ్యబలిపూజలను పాదర్ మందపాటి రాజుతో కలసి అర్పించారు.
- **ఉంగుటూరు :** దివంగత మాజీ ఎమ్మెల్సీ షేక్ షాబ్జి పేరున యూటీఎఫ్ నాయకత్వం క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఎంఈవో కె.శ్రీనివాస్, ఉనుముల రాంబాబు, డాకి జోగి నాయుడు పాల్గొన్నారు.
- **చింతలపూడి :** రాఘవాపురం సొసైటీ ఛైర్‌పర్సన్‌గా గిరి భోగారావు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. సభ్యులుగా కొరిపల్లి నాగ సుబ్బారావు, తాటిపర్తి గోపాలరావు బాధ్యతలు స్వీకరించారు.
- **ద్వారకా తిరుమల :** ఎల్‌కే.అద్వానీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడంపై బీజేపీ మండల నేతలు తాండ్ర సందీప్ నిడమర్తి సత్యకుమార్, షైలు శ్రీనివాస్, గణపతి హర్షం వ్యక్తం చేశారు.







చింతలపూడిలో రా కదలిరా సభకు వెళ్లే కార్ల ర్యాలీకి కైకలూరులో జెండా ఊపి ప్రారంభిస్తున్న పెన్మెత్స వెంకటేశ్వరరాజు, మెంటే పార్థసారథి.. చనుబండ, ఆగిరిపల్లి, నూజివీడు నుంచి సభకు తరలివెళుతున్న టీడీపీ, జనసేన నాయకులు

రా కదలిరా సభకు తరలిన తెలుగు తమ్ముళ్లు



ముసునూరు నుంచి తరలివెళుతున్న టీడీపీ నాయకులు

కైకలూరు, ఫిబ్రవరి 5: చింతలపూడిలో జరిగిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రా.. కదలిరా బహిరంగ సభకు కైకలూరు నియోజకవర్గం నుంచి టీడీపీ నేతలు పెద్దఎత్తున తరలివెళ్లారు. సోమవారం కైకలూరు పార్టీ కార్యాలయం వద్ద కైకలూరు, మండవల్లి, కలిదిండి మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. అక్కడి నుంచి పెన్మెత్స వెంకటేశ్వరరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుమారు 150 కార్లలో ర్యాలీగా బహిరంగ సభకు తరలివెళ్లారు. నియోజకవర్గ పరిశీలకుడు మెంటే పార్థసారఽథి, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కైకలూరు, మండవల్లి, మండల పార్టీల అధ్యక్షులు పెన్మెత్స త్రినాథరాజు, నారగాని నాగేశ్వరరావు, పోకల జోగిరాజు, రాష్ట్ర వడ్డి సాధికార కమిటీ కన్వీనర్ బలే ఏసురాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్‌చౌదరి, మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, పార్టీ నాయకులు కొడాలి వినోద్, పోసిన పాండురంగారావు, చలసాని జగన్మోహనరావు, కొత్తూరి విఠల్, మహిళా నాయకురాలు కందేపి పద్మ, దారం సుధా తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండి మండలం నుంచి భారీ సంఖ్యలో టీడీపీ శ్రేణులు చింతలపూడి తరలివెళ్లారు. మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సుమారు 90 వాహనాలలో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. తొలుత మాజీ ఎంపీ మాగంటి బాబు బర్త్ డే కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. నాయకులు నున్న రమాదేవి, అంగ్రాజు శ్రీనివాస్, భోగేశ్వరరావు, రెడ్డి చక్రవర్తి, కొత్తపల్లి బంగార్రాజు, తాడినాడ బాబు, కురేళ్ల ఏడుకొండలు, సీతారామాంజనేయులు, చాబత్తిన రాజు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: చింతలపూడిలో టీడీపీ రా కదలిరా సభకు ముదినేపల్లి మండలం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తూరు విఠల్, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు చలసాని జగన్మోహన్‌రావు, జిల్లా అధికార ప్రతినిధి బొప్పన సుందరరామయ్య, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పంతగాని సురేష్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్ తదితరులు నాయకత్వంలో తరలివెళ్లారు.

నూజివీడు టౌన్: రా కదలిరా సభకు నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, పార్టీ నూజివీడు మండల అధ్యక్షులు ముసునూరి రాజా ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. బత్తులవారిగూడెం, యనమదల, సుం కొల్లు గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు టీడీపీ అధినేత చంద్ర బాబునాయుడు భారీ బహిరంగ సభకు తరలివెళ్ళారు. నూజివీడు నియోజకవర్గ జనసేన కార్యకర్తలు తరలివెళ్ళారు. పార్టీ నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణిబాబు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా కార్యకర్తలు తరలివెళ్ళారు. ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు పాశం నాగబాబు, ఉమామహేశ్వరి, జక్కుల లక్ష్మి, జ్యోతి, జనసేన నాయకులు తోట వెంకట్రావు, ఏనుగుల చక్రి తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: రా..కదలిరా సభకు చాట్రాయి మండలం నుంచి టీడీపీ-జనసేన శ్రేణులు భారీగా తరలివెళ్ళాయి. ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లలో నాయకులు కార్యకర్తలు మహిళలు ఉత్సాహంగా తరలివెళ్ళారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మరిడి చిట్టిబాబు, పలగాని దుర్గారావు, నాయకులు తరలివెళ్ళారు.

ఆగిరిపల్లి: తోటపల్లి, చిన్నాగిరిపల్లి నుంచి నూజివీడు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీను, పార్టీ మాజీ మండల అధ్యక్షులు పలగాని గంగాధర్, కార్యకర్తలతో 12 కార్లతో సభకు తరలివెళ్ళారు.

ముసునూరు: మండల వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు చంద్రబాబు సభకు భారీగా తరలివెళ్ళారు. పార్టీ మండల అధ్యక్షులు దేవినేని ఢలరామ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో పలు వాహనాలు ఏర్పాటు చేశారు.



కదిలింది నుంచి బయలుదేరి వెళ్తున్న టీడీపీ నాయకులు



వంటావార్పుతో న్యాయవాదుల నిరసన

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 5: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేయాలని కోరుతూ న్యాయవాదులు చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం నూజివీడు కోర్టుహాలు వద్ద వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించలేని ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ -2022ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నూజివీడు బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రేమికుడి కోసం మౌన దీక్ష

పెద్దల మధ్యవర్తిత్వంతో కథ సుఖాంతం



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 5: మూడు రోజులుగా మౌన దీక్షచేసి దూరమైన ప్రేమికుడిని పెళ్ళికి ఒప్పించిందా యువతి. విజయవాడలోని ఒక ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తున్న ఆగిరిపల్లి మండలం నూగొండపల్లి గ్రామానికి చెందిన మౌనికకు నున్నలో రాడ్ బెండింగ్ పనులు చేసే వెలటూరు గ్రామానికి చెందిన సువర్ణరాజుతో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారి ఇద్దరూ ఒక్కటవ్వడంతో ఆమె గర్భం దాల్చింది. వివాహానికి ఇరుపక్షాల బంధువులు ఒప్పుకున్నారు. అయితే ఆ రెండు కుటుంబాల మధ్య మనస్పర్థల కారణంతో వివాహం ఎప్పుడు జరిపించేదీ తేలకపోవడంతో యువతి ఆత్మహత్య చేసుకుందామని నూగొండపల్లి శివారులో ఉన్న పోతవరప్పాడు గ్రామానికి వచ్చి అక్కడ రక్షణ ఆశ్రయం వద్ద మౌన దీక్షకు కూర్చుంది. ఇది గమనించిన ఆశ్రయం వ్యవస్థాపకుడు గురివింద పల్లి చిట్టిబాబు గ్రామ పెద్దలను పిలిపించారు. వారు 100కి కాల్‌చేయగా, దిశ టీమ్ వచ్చి వివరాలు కనుక్కుని వెలటూరు గ్రామంలోని యువకుడు సువర్ణరాజును, సంబంధీకులను పోతవరప్పాడు రప్పించారు. ఇక్కడ పెద్దల సమక్షంలో ఇరుపక్షాలకు రాజీ కుదర్చగా ఈ నెల 12న వివాహం జరుపుతామని మాటిచ్చారు. మధ్యవర్తులుగా ఎమ్మార్పీఎస్ నాయకులు గురువిందపల్లి చిట్టిబాబు, మంగలపూడి నాగేశ్వరరావు వ్యవహరించారు. దండలు మార్పించి నిశ్చితార్థం జరిపించారు.

చలో అసెంబ్లీకి వెళ్లవద్దని సర్పంచ్‌లకు నోటీసులు

ముదినేపల్లి, ఫిబ్రవరి 5 : పంచాయతీ రాజ్ చాంబర్ ఆధ్వర్యంలో మంగళవారం జరగనున్న చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లవద్దని ముదినేపల్లి మండలంలోని సర్పంచ్‌లకు పోలీసులు సోమవారం రాత్రి నోటీసులు జారీ చేశారు. మండలంలోని టీడీపీ సానుభూతిపరులైన దాకరం సర్పంచ్ జాస్తి రాజా, బొమ్మినంపాడు సర్పంచ్ దారం సుధా, పెదపాలపర్రు సర్పంచ్ ఘంటా రాకేష్‌లకు హెచ్‌సీ రామారావు ఆధ్వర్యంలో నోటీసులు అందజేసి చలో అసెంబ్లీకి అనుమతిలేనందున సర్పంచ్‌లు వెళ్లవద్దని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న నాటికలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 5: నూజివీడు నాటక మహోత్సవాన్ని నూజివీడు ఎస్.ఆర్.ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి గుంటూరు అభినవ్ ఆర్ట్స్‌కు చెందిన కళాకారులు రాష్ట్ర నాటకోత్సవాల్లో నంది అవార్డును పొందిన ఇంద్రప్రస్థం నాటికను ప్రదర్శించారు. యువతీ యువకుల మధ్య ప్రేమ అంశంతో మొదలయ్యే ఈ నాటికలో తల్లిదండ్రులు, యువతను సన్మార్గంలో నడిపేందుకు ఏ విధంగా వ్యవహరించారు అనే అంశం నాటకాన్ని తిలకించేందుకు వచ్చిన యువత, పెద్దవారిని సైతం ఆకట్టుకుంది. రాష్ట్రప్రభుత్వ నందినాటకోత్సవాల్లో అనేక బహుమతులు సాధించిన హాస్య నాటిక 'పక్కింటి మొగుడు'ను ప్రకాశం జిల్లా కుప్పాలకు చెందిన పండు క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించి ఆహుతులను నవ్వుల్లో ముంచెత్తారు. ఈ నాటక మహోత్సవాన్ని నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్‌అప్పారావు ప్రారంభిం చగా నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, లయన్స్ క్లబ్ సభ్యుడు కృష్ణప్రసాద్, శ్రీసత్య నృత్య సంగీత కళాశాల ప్రిన్సిపల్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రప్రస్థం నాటికలో ఒక సన్నివేశం

మున్సిపల్ కమిషనర్‌గా వెంకట రామిరెడ్డి



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 5: నూజివీడు మున్సిపల్ కమిషనర్‌గా ఆర్.వెంకట రామిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లా డోన్ నుంచి ఈయన నూజివీడుకు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా నూజి వీడు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సయ్యద్ అబ్దుల్ రషీద్ ప్రకాశం జిల్లా అద్దంకికి బదిలీ కాగా ఆయన స్థానంలో మంగళగిరి మున్సిపల్ కమిషనర్ గా పనిచేస్తున్న హేమమాలిని నియమితులయ్యారు. అయితే జనవరి 31న బాధ్యత లు స్వీకరించిన ఆమె నాలుగైదురోజుల్లోనే నందిగామకు బదిలీ కాగా తాజాగా నూజివీడు మున్సిపల్ కమిషనర్‌గా ఆర్.వెంకటరామిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

తహసీల్దార్‌గా మృత్యుంజయరావు



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 5: ఆగిరిపల్లి తహసీల్దార్‌గా బండి మృత్యుంజయరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రావులపాలెం నుంచి ఆగిరిపల్లికి బదిలీపై వచ్చారు. బాధ్యతగా విధులు నిర్వహిస్తానని తెలిపారు.

ఎంపీడీవోకు బదిలీ సత్కారం



ముదినేపల్లి, ఫిబ్రవరి 5 : ముదినేపల్లి నుంచి గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలానికి బదిలీ అయిన ఎంపీడీవో పి.మల్లీశ్వరిని మండల పరిషత్ పాలకవర్గం, మండల సర్పంచ్‌ల ఫోరం, కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. సోమవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధ, కార్యాలయ ఏవో రమణబాబు, సిబ్బంది, ఇవోపీఆర్డీ లక్ష్మీనారాయణ, వివిధ శాఖల అధికారులు సన్మానించి ఆమె సేవలను కొనియాడారు. సర్పంచ్‌ల తరపున మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శీలం రామకృష్ణ ఆమెను సత్కరించారు. నూతన ఎంపీడీవో గంగాధరరావును కూడా మండల పరిషత్ పాలకవర్గం సత్కరించి అభినందించింది.



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా మాగంటి బాబు పుట్టినరోజు వేడుకలు

కైకలూరు, ఫిబ్రవరి 5: మాజీ ఎంపీ మాగంటి బాబు పుట్టినరోజు సందర్భంగా సోమవారం కైకలూరు టీడీపీ కార్యాలయంలో అభిమానులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకుడు మెంటే పార్థసారథి, టీడీపీ నాయకుడు పెన్మెత్స వెంకటేశ్వరరావు, కైకలూరు, మండవల్లి, మండల పార్టీల అధ్యక్షులు పెన్మెత్స త్రినాథరాజు, నారగాని నాగేశ్వరరావు, పోకల జోగిరాజు, రాష్ట్ర వడ్డి సాధికార కమిటీ కన్వీనర్ బలే ఏసురాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ ఎంపీపీ నరసింహారావు, టీడీపీ నాయకులు కొడాలి వినోద్, పోసిన పాండురంగారావు, చలసాని జగన్మోహనరావు, కొత్తూరి విఠల్, మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, దారం సుధా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో సమష్టిగా వ్యవహరించాలి

మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ రామిశెట్టి

ముదినేపల్లి, ఫిబ్రవరి 5 : గ్రామాల్లో అభివృద్ధి పనులను సర్పంచ్, ఎంపీటీసీలు సమష్టిగా నిర్వహించాలని ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మండలంలోని స్త్రీ శిశు సంక్షేమశాఖ, గృహ నిర్మాణం, నీటి పారుదల, మధ్యాహ్న భోజన పథకం, విద్యుత్, వైద్య విద్యా శాఖల పనితీరుపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాన్ని సుమారు రూ.5 కోట్లతో చేపట్టామని తెలిపారు. పక్కా డ్రైన్ల నిర్మాణాలకు కూడా మండల పరిషత్ నిధులు కేటాయిస్తున్నామని పనుల నిర్వహణలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సహకారంతో వ్యవహరించాలన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీలు రాచూరి రాధ, చొప్పర సునీత, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, ఎంపీడీవో గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు. కాల్వలకు నీటి విడుదల పెంచాలని, జగనన్న కాలనీల్లో అంతర్గత రహదారులను అభివృద్ధి చేయాలని పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కోరారు.

ముున్సిపల్ కార్యాలయానికి బ్యాటరీ ఆటోలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 5: నూజివీడు మున్సిపల్ కార్యాలయ పారిశుధ్య పనుల నిర్వహణకు సోమవారం ఆరు ఎలక్ట్రికల్ బ్యాటరీ చేరాయి. ఒక్కో వాహనం సుమారు రూ.4లక్షల వరకు ఉంటుందని, పట్టణ పరిధిలోని 32 మున్సిపల్ వార్డుల్లో పారిశుధ్య పనుల నిర్వహణ అంతర్గత రహదారుల్లో నిర్వహణకు ఇవి అనుకూలంగా ఉంటాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలి

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 5: విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని నూజివీడు ఉప విద్యాశాఖాధికారి సేవ్యా అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సెకండ్ ఇంటర్నేషనల్ కరాటే, మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో నూజివీడు శారదా కళాశాలకు చెందిన విద్యార్థి మేహక్, విజిడమ్ పాఠశాలకు చెందిన ఆలీమ్ శామ్యూర్‌లు బంగారు పతకాలు సాధించగా, మాజిన్ ఖాద్రీ వెండి పతకం సాధించాడు. విజేతలతో పాటు కోచ్ అంజిబాబును ఆయన అభినందించారు.



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి రామకృష్ణయ్య

న్యాయాధికారి రామకృష్ణయ్య సబ్ జైలు తనిఖీ

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 5: నూజివీడు సబ్ జైల్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కేవీ రామకృష్ణయ్య సోమవారం సందర్శించారు. జైల్లోని రిమాండ్ ఖైదీలతో ఆయన మాట్లాడారు. ఆర్థిక స్తోమతలేని ఖైదీలకు న్యాయసేవా ధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి హరిబాబు, సబ్ జైల్ సూపరింటెండెంట్ జి.ప్రసాద్ పాల్గొన్నారు.

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడిగా పద్మారావు



కలిదిండి, ఫిబ్రవరి 5 : మాల మహానాడు జిల్లా అధ్యక్షు డిగా కలిదిండికి చెందిన ఈదా పద్మారావు సోమవారం ఏక గ్రీవంగా ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఎస్సీఎస్టీల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు విజయశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో పలికిన ల్యాండ్ ఫోను

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలిదిండి, ఫిబ్రవరి 5 : కలిదిండి పోలీస్ స్టేషన్‌లో మూడు నెలలుగా మూగబోయిన ల్యాండ్ ఫోన్ సోమవారం పలికింది. ఆంధ్రజ్యోతిలో జనవరి 21వ తేదీన ప్రచురితమైన 'అత్యవసరమైతే ఎలా' కథనానికి పోలీసు అధికారులు స్పందించారు. ల్యాండ్ ఫోన్ మరమ్మతులు చేయించటంతో పోలీస్ స్టేషన్‌లో ల్యాండ్ ఫోన్ పని చేస్తోందని, ఏదైనా సమస్యలుంటే 08677 -232033 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్‌ఐ ప్రియకుమార్ తెలిపారు.

ధర్మకర్తల మండలి కోసం దరఖాస్తుల ఆహ్వానం

కైకలూరు, ఫిబ్రవరి 5: కైకలూరు మండలం వరహాపట్నంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి ధర్మకర్తల మండలి నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఆలయ అధికారి వీఎస్‌కే శేఖర్ తెలిపారు. ఈ నెల 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మినుములో చీడపీడలు నివారణపై దృష్టి పెట్టాలి

మండవల్లి, ఫిబ్రవరి 5: మినుము, పెసర పైర్లపై చీడపీడలు నివారించేందుకు రైతులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు జి వెంకటమణి సూచించారు. సోమవారం మండవల్లి మండలంలోని పెరికేగూడెం, కానుకొల్లు, లింగాల, కొర్లపాడు తదితర గ్రామాల్లో మండవల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ జరీనాతో కలిసి మినుపు పంటలను పరిశీలించారు. పంట దిగుబడి పెరిగేందుకు చేపట్టే దశల వారీ విధానాన్ని ముందస్తు వ్యాధి నివారణ చర్యలను వెంకటమణి రైతులకు వివరించారు. మినుము పైరుపై వ్యాపించిన చీడపీడల నివారణకు చేపట్టే మందులను ఆమె రైతులకు వివరించారు. అనంతరం మండవల్లి వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించి రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు.

వన సంరక్షణ సమితి భూములను కాపాడాలి



నూజివీడు, ఫిబ్రవరి 5: వనసంరక్షణ సమితి భూములను కాపాడాలని సోమవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి డి.పుల్లారావు మాట్లాడుతూ చాట్రాయి మండలం ఆరుగొలనుపేటలో వనసంరక్షణ భూమి అని తెలిసి కొనుగోలుచేసి దొడ్డిదారిన పట్టాలు పొందటానికి ప్రయత్నిస్తున్న వారి పై చర్యలు తీసుకుని వనసంరక్షణ సమితులను కాపాడాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. సీపీఐ లిబరేషన్ జిల్లా కార్యదర్శి డి.హరినాథ్, కావటి వెంకటేశ్వరరావు, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలడుగుకు ఘన నివాళి



నూజివీడు, ఫిబ్రవరి 5: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ దివంగత పాలడుగు వెంకట్రావు వర్థంతిని పురస్కరించుకుని సోమవారం నూజివీడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నూజివీడు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రవికుమార్ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఘనత పాలడుగు వెంకట్రావుకే దక్కుతుందన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పరిమి సాగర్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు పాలడుగు నాగభరత్, శివశంకర్‌రావు, సీనియర్ నాయకులు రమేష్, మండల అధ్యక్షుడు దేశిబోయిన శ్రీనివాసరావు, సూర్యదేవర ప్రసాద్, యార్లగడ్డ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఉప్పుటేరులో దూకి యువకుడి ఆత్మహత్య



సోమశేఖర్ (ఫైల్)

కైకలూరు, ఫిబ్రవరి 5: యువకుడు ఉప్పుటేరులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కైకలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు గ్రామానికి చెందిన మడిచర్ల సోమశేఖర్ (23) ఆదివారం రాత్రి కైకలూరు మండలం ఆలపాడు శివారులో ఉన్న ఉప్పుటేరు వంతెనపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ సమయంలో అతని స్నేహితులతో కలసి ఆ ప్రాంతానికి వచ్చాడు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంటానని పరిగెత్తుకుంటూ వెళ్లి ఉప్పుటేరులో దూకేశాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై టి.రామకృష్ణ గజ ఈతగాళ్ళతో ఉప్పుటేరులో గాలించి సోమవారం ఉదయానికి మృతదేహాన్ని వెలికితీశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

సీడీపీవో లైంగిక వేధింపులపై ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 5: సీడీపీవో తనను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని అంగన్‌వాడీ టీచర్ పోలీసులను ఆశ్రయించిన ఉదంతమిది. ముదినేపల్లి పోలీసుల వివరాల ప్రకారం ముదినేపల్లి మండలం వి. రావిగుంటకు చెందిన అంగన్‌వాడీ కేంద్రం టీచర్ చిన్నం నిరోషా తాను సక్రమంగా విధులు నిర్వహిస్తున్నా కైకలూరు సీడీపీవో ఆనంద్‌కుమార్ తాను సక్రమంగా విధులు నిర్వహించటం లేదని, రికార్డులు పొందుపరచటంలో అలసత్వం వహిస్తున్నానని వేధిస్తున్నాడని, తన పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వెంకట కుమార్ తెలిపారు.

తాళాలు పగులగొట్టి చోరీ

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 5: మండలంలోని మర్రిబంధం గ్రామానికి చెందిన షేక్ సైదా ఆదివారం రాత్రి గ్రామంలోని తన తల్లి ఇంటికి వెళ్ళాడు. సోమవారం ఉదయం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులకొట్టి ఉండటం బీరువాలో ఉంచిన రూ.70 వేలు నగదు, రెండు కాసుల బంగారం, వెండి వస్తువులు చోరీకి గురైనట్లుగా గుర్తించి నూజివీడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై నూజివీడు రూరల్ ఎస్సై మల్లికార్జున్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9 మంది జూదరులు అరెస్ట్

మండవల్లి, ఫిబ్రవరి 5: మండవల్లి మండలం పెరికేగూడెంలో పేకాడుతున్న 9 మంది జూదరులను మండవల్లి పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.9550 నగదు స్వాధీనం చేసుకున్నట్లు మండవల్లి ఎస్సై సీహెచ్ రామచంద్రరావు తెలిపారు. నిందితులను మండవల్లి పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పంచాయతీలకు.. అదనపు భారం

- పంట కాల్వల్లో అరకొర నీటి సరఫరా
- ఇంజన్లతో మంచినీటి చెర్వులు నింపుతున్న పంచాయతీలు
- సొంత సొమ్ము వెచ్చించాల్సి వస్తోందని సర్పంచ్‌ల ఆవేదన

మంచినీటి చెరువులను నింపటం పంచాయతీలకు భారంగా మారింది. ప్రధాన పంట కాల్వలకు పుష్కలంగా నీటిని విడుదల చేయనందున ఇంజన్లతోనే చెరువులకు నీరు తోడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాల్వలకు దూరంగా ఉన్న పంచాయతీ చెరువులను నింపటం తమకు ఆర్థిక భారంగా మారిందని సర్పంచ్‌లు వాపోతున్నారు.

ముదినేపల్లి, ఫిబ్రవరి 5 : ముదినేపల్లి మండలంలో 32 గ్రామ పంచాయతీలు ఉండగా, సుమారు 25 పంచాయతీల్లో చెరువులకు నీటిని ఇంజన్లతోనే తోడాల్సిన పరిస్థితి నెలకొంది. కాల్వలకు నీరు సరిపడినంత విడుదల చేస్తే బ్రాంచి కాల్వల ద్వారా చాలా గ్రామాల చెరువులలో నీటిని సరఫరా చేయవచ్చు. మండలంలోని ప్రధాన పంట కాల్వలైన పోల్‌రాజ్, క్యాంప్ బెల్ కెనాల్స్‌కు గుడ్లవల్లేరు లాకుల నుంచి వంద క్యూసెక్కుల లోపే నీటిని విడుదల చేస్తుండటం వల్ల చెరువులకు వెళ్లే బ్రాంచి కాల్వలు, పంట బోదెల ద్వారా నీటిని సరఫరా చేసే అవకాశం లేకుండా పోయింది. మండలంలోని పేరూరు, పెయ్యేరు, ముదినేపల్లి, చేవూరు, కాకరవాడ, బొమ్మినంపాడు, వైవాక, ఊటుకూరు, దేవపూడి, ఈడేపల్లి, అల్లూరు తదితర గ్రామాలకు ఇంజన్ల ద్వారానే నీటిని చెరువులకు తోడాల్సి వస్తోంది. అసలే నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీలకు చెరువులను నింపటం మరో భారంగా ఉంది. అధికారులు చెరువులను నింపాలని ఆదేశాలు జారీ చేయటమే తప్ప నిధుల మంజూరుపై నోరు మెదపరు. మండలంలోని సర్పంచ్‌లు సొంత ఖర్చుతో ముందుగా చెరువులను నింపే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధాన కాల్వల నుంచి ఇంజన్లతో నీటిని చెరువులకు సరఫరా చేసేందుకు ఖర్చు లక్షల్లోనే ఉంటున్నది. కొన్ని పంచాయతీల చెరువులకు ప్రధాన కాల్వల నుంచి బ్రాంచి కాల్వలకు, బ్రాంచి కాల్వల నుంచి చెరువులోకి రెండు చోట్ల ఇంజన్లు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



పేరూరు పంచాయతీ చెరువుకు ఇంజన్లతో నీటి తోడకం

సొంత సొమ్ముతో చెరువులు నింపుతున్నాం

మా గ్రామంలో పంచాయతీ చెరువును నీటితో నింపేందుకు మా సొంత సొమ్ము ఖర్చు చేస్తున్నాం. పంచాయతీలో నిధులు లేవు. చెరువులను నీటితో నింపాల్సిన అవసరం ఉంది. ఇంజన్లతో నీటిని లిఫ్ట్ చేసేందుకు రోజుకు రూ.10 వేలు ఖర్చవుతోంది.

-పుట్టి మాధవీ రాణి, సర్పంచ్, పేరూరు



మురుగునీటి మధ్య కల్యాణ మండపం

నిరుపయోగంగా కల్యాణ మంటపం

ఆశయం నెరవేరలేదంటూ దాత ఆవేదన

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 5: ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి ఆలయం పక్కన దాత మడుపల్లి రామ నాగ లక్ష్మీనారాయణరావు ఆరేళ్ల క్రితం నిర్మించిన కల్యాణ మండపం నిరుపయోగంగా ఉంది. దేవస్థానంలో నుంచి బయటకు వచ్చే మురుగునీరు, మంటపం ముందుకు చేరి పందులకు, పశువులకు ఆవాసంగా మారి దుర్గంధం వెదజల్లుతూ మండపానికి దారి లేకుండా చేసిందని ప్రజలు అంటున్నారు. కల్యాణ మండపం లోపల గోడలకు చెదలుపట్టి చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. బయట కల్యాణ మండపాలకు భారీగా అద్దెలు ఉండడంతో సామాన్యుడికి పెళ్లిళ్ల తదితర శుభకార్యాలకు ఉపయోగించుకునేందుకు నామమాత్రపు రుసుముతో ఉపయోగించుకునేలా ఆ అద్దె కూడా దేవస్థానానికి చెందేలా నిర్మించినట్టు, అది నిరుపయోగంగా మారడంపై దాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంకా పనులు చేయాల్సి ఉంది : ఈవో

ఈ విషయంపై ఆలయ ఈవోను వివరణ కోరగా కల్యాణమండపం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని ఇంకా కొన్ని పనులు చేయాల్సి ఉందని, అవి పూర్తయ్యాక అద్దెలకు ఇస్తామని తెలిపారు.